# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ | సంపుటి: 19 సంచిక : 122 | ఆదివారం 04, జనవరి 2026 | పేజీలు: 06 | వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamabad-Adilabad -Vijayawada-Guntur-Vizag-Kurnool | www.prajaswaramdaily.com


## మావోయిస్టు పార్టీకి కోలుకోలేని దెబ్బ

**పీఎల్జీఏ కమాండర్ దేవా, రాజిరెడ్డి సహా 20 మంది లొంగుబాటు**
**48 ఆయుధాలు, బుల్లెట్ల అప్పగింత**
**తెలంగాణలో అంతమైన రాష్ట్ర కమిటీ**
**పీఎల్జీఏ పని అయిపోయింది: డీజీపీ**
**ఆపరేషన్ కగార్ దెబ్బకు ఉక్కిరిబిక్కిరి**




## కృష్ణ బేసిన్ జల ద్రోహి బీఆర్ఎస్

**నదీ జలాల సమస్యలపై ఎవరితోనైనా చర్చకు సిద్ధం**
**పాలమూరు-రంగారెడ్డికి అన్యాయం చేసింది కేసీఆరే**
**ఈ టర్మ్‌లోనే కృష్ణా బేసిన్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తాం**
**మేము ఒత్తిడి చేస్తేనే రాయలసీమ ప్రాజెక్టును ఆపారు**
**పోలవరం-నల్లమల ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వొద్దు**
**అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం.. జలాల్లో వాటా సాధిస్తాం**
**కృష్ణా జలాలపై లఘు చర్చలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**
**రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్**



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
కృష్ణా బేసిన్ జల ద్రోహులు బీఆర్ఎస్ నేతలేనని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. శనివారం శాసనసభలో కృష్ణా నదీ జలాల హక్కులపై జరిగిన లఘు చర్చలో ఆయన మాట్లాడుతూ, బీఆర్ఎస్ గొప్పలు చెప్పుకుంటోందే తప్ప, వాస్తవానికి తెలంగాణకు తీరని అన్యాయం చేసిందని విమర్శించారు. తెలంగాణ హక్కులను కాపాడటంలో రాజీ పడే ప్రసక్తే లేదని, ఒక్క నీటి చుక్కను కూడా వదులుకోమని ఆయన స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణకు 299 టీఎంసీలు, ఏపీకి 512 టీఎంసీలుగా నీటి వాటాలను అంగీకరిస్తూ సంతకాలు చేశారని మంత్రి గుర్తు చేశారు. కేవలం 34 శాతం నీళ్లు తెలంగాణకు సరిపోతాయని కేసీఆర్, హరీశ్ రావులు అంగీకరించడం తెలంగాణకు మరణశాసనం రాసినట్లేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లలో ఇరిగేషన్ పేరుతో రూ. 1.80 లక్షల కోట్లు ఖర్చు చేసినా, కృష్ణా జలాల వినియోగంలో రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదని మండిపడ్డారు. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ముందు తెలంగాణకు 783 టీఎంసీల నీటిని (మొత్తం కేటాయింపుల్లో సుమారు 71 శాతం) కేటాయించాలని ప్రభుత్వం బలమైన వాదనలు వినిపిస్తోందని ఉత్తమ్ తెలిపారు. కృష్ణా నదీ పరివాహక ..మిగతా 3లో

## సభా సంప్రదాయాలకు కాంగ్రెస్ భంగం

**రాజ్యాంగానికి తూట్లు పొడవడమే మార్పులా?**
**ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విలువలు వల్లెవేసి..**
**అధికారంలోకి రాగానే నచ్చినట్లు తిలోదకాలా!**
**పీపీటీపై మంత్రి ఉత్తమ్ ద్వంద్వ వైఖరిపై విమర్శలు**
**'ఎక్స్' వేదికగా మాజీ మంత్రి హరీశ్ రావు ధ్వజం**



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అన్ని సంప్రదాయాలు, పద్ధతులు, మర్యాదలకు భంగం కలిగిస్తూ, రాజ్యాంగానికే తూట్లు పొడవడాన్ని తన 'మార్పు'గా చూపిస్తోందని మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు మండిపడ్డారు. అసెంబ్లీ వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న రాజకీయ ద్వంద్వ వైఖరిని, అనైతిక విధానాలను ఎండగడుతూ 'ఎక్స్' వేదికగా శనివారం ఆయన స్పందించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సంప్రదాయాలు, విలువలు అంటూ నీతులు చెప్పిన కాంగ్రెస్ నాయకులు, అధికారంలోకి రాగానే వాటిని తుంగలో తొక్కి తమకు నచ్చినట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు 2016 మార్చి 30న స్పీకర్‌కు రాసిన ఉత్తరాన్ని హరీశ్ ఈ సందర్భంగా ప్రస్తావించారు.

**విలువలకు తిలోదకాలు**
'అసెంబ్లీలో ఆడియో, విజువల్ ..మిగతా 2లో

## పంచాయతీ సవరణ బిల్లులకు ఆమోదం

**వ్యతిరేకించిన బీజేపీ, సీపీఐ సభ్యులు**
**జనాభా స్వీయ నియంత్రణ దృష్టి పెట్టాలన్న సీపీఐ**
**సీఎం దృష్టికి తీసుకెళ్తానని మంత్రి సీతక్క హామీ**
**మూడు గ్రామాల పేర్లు మార్పుపై సభలో చర్చ**



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
ఇద్దరి కన్నా ఎక్కువ మంది పిల్లలుంటే పంచాయతీ ఎన్నికల్లో పోటీకి అనర్హులన్న నిబంధనను సడలిస్తూ అసెంబ్లీ శనివారం పంచాయతీరాజ్ సవరణ బిల్లులకు ఆమోదం తెలిపింది. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఆదేశాల మేరకు ఈ బిల్లులను మంత్రి సీతక్క ప్రవేశపెడుతూ వనపర్తి జిల్లాలో జైన్ తిరుమలాపూర్ గ్రామం పేరును జయన్న తిరుమలాపూర్‌గా మార్చాలని ప్రతిపాదన పెట్టారు. ప్లానింగ్ కమిషన్ ఛైర్మన్ చిన్నారెడ్డి ముత్తాత పేరు జయన్నగా ఉండేదని, ఆయన పేరుపై ఉన్న గ్రామం పేరు కాలక్రమేనా జైన్ తిరుమలాపూర్‌గా ముద్రపడిందని, దాన్ని జయన్న తిరుమలాపూర్‌గా మార్చాలని సీతక్క సభ దృష్టికి తీసుకువచ్చారు. గ్రామాల పేర్ల మార్పు, ..మిగతా 2లో

## సొంత భూమి లేనోళ్లకు స్థలాలు ఇస్తాం

**త్వరలో జీహెచ్ఎంసీలో అర్బన్ హౌసింగ్ పాలసీ**
**అవసరమైతే అంతస్తులు పెంచి భవనాలు నిర్మిస్తాం**
**ఇందిరమ్మ స్కీమ్‌ను పకడ్బందీగా అమలు చేస్తాం**
**రూ.22వేల 500 కోట్ల నిధులు కేటాయించాం**
**శాసన సభలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
జీహెచ్ఎంసీ వంటి పట్టణ ఏరియాల్లో సొంత భూమి లేని నిజమైన అర్హుల కోసం సరికొత్త అర్బన్ హౌజింగ్ పాలసీని తీసుకొస్తున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. శనివారం ఆయన అసెంబ్లీలో మాట్లాడుతూ, గ్రేటర్ హైదరాబాద్ వంటి పెద్ద నగరాల్లో ..మిగతా 2లో

## కొండగట్టులో జన సేనాని

**ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు**
**రూ.35.19 కోట్ల అభివృద్ధి పనులకు భూమి పూజ**
**ఎప్పటికైనా తెలంగాణలో కీ రోల్ పోషిస్తామన్న పవన్**







## కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి సలహాలు ఇస్తారని భావించాను

**కేసీఆర్ నదీ జలాల గురించి మాట్లాడారన్న ముఖ్యమంత్రి**
**ఆయన చెప్పినందువల్లే నదీ జలాల అంశాన్ని చర్చకు పెట్టామని వెల్లడి**
**రెండేళ్లుగా కేసీఆర్ సభకు రాకపోవడం విచారకరమని వ్యాఖ్య**

## ప్రాధాన్యతను బట్టి ప్రాజెక్టుల బిల్లులు

**ఎస్ఎల్బీసీ టన్నెల్‌పై ప్రజా ప్రభుత్వం స్పెషల్ ఫోకస్**
**నిధులున్నాయ్.. బిల్లుల ఆలస్యానికి కాంట్రాక్టర్లే కారణం**
**పాలమూరు, కృష్ణా ప్రాజెక్టులపై సీఎం రేవంత్ పర్యవేక్షణ**
**అసెంబ్లీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కీలక ప్రకటన**





# కొండగట్టులో జన సేనాని

- ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు
- రూ.35.19 కోట్ల అభివృద్ధి పనులకు భూమి పూజ
- ఎప్పటికైనా తెలంగాణలో కీ రోల్ పోషిస్తామన్న పవన్

హైదరాబాద్, (ప్రజాస్వరం):

ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ జగిత్యాల జిల్లాలోని కొండగట్టు ఆంజనేయ స్వామివారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. రూ.35.19 కోట్ల టీటీడీ నిధులతో నిర్మించ తలపెట్టిన 96 గదుల ధర్మశాల, దీక్ష విరమణ మండప నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన పవన్, కొండగట్టు తనకు పునర్జన్మనిచ్చిందని అన్నారు. గతంలో జరిగిన విద్యుత్ ప్రమాదం నుంచి కొండగట్టు ఆంజనేయుడే తనను రక్షించారని చెప్పారు. దీక్ష విరమణకు మండపం, సత్రం కావాలని గతంలో తనను కోరారని, టీటీడీ సభ్యులు, తెలంగాణ నాయకుల సమిష్టి కృషితో ఇప్పుడది సాకారం అవుతున్నదని వివరించచారు. ఈ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, తెలంగాణ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

**జనసేన నేతలతో సమావేశం**

కొండగట్టులో తెలంగాణ నాయకులు, కార్యకర్తలతో పవన్ కళ్యాణ్ సమావేశం నిర్వహించారు. డబ్బున్న నాయకులు కాదు దమ్మున్న యువత కావాలని అన్నారు. తెలంగాణలో పోరాట శక్తి ఉన్న యువతకు కొదవ లేదని, అలాంటి వారికి జనసేన సిద్ధాంతాలు బలాన్నిస్తాయని చెప్పారు. జన సైనికులు తెలంగాణకు భవిష్యత్తు కావాలని, ఇక్కడ పార్టీ నిర్మాణం వారి చేతుల్లోనే ఆధారపడి ఉన్నదని వ్యాఖ్యానించారు. ఏదో ఒక రోజు తెలంగాణలో జనసేన కీలక పార్టీగా అవతరిస్తుందని పవన్ కళ్యాణ్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# సొంత భూమి లేనోళ్లకు స్థలాలు ఇస్తాం

మొదటిపేజీ తరువాయి

సొంత భూమి లేని లబ్దిదారులకు సర్కారు భూముల్లో మూడు నుంచి ఐదు అంతస్తుల భవనాలను నిర్మించి ఇండ్లను కేటాయిస్తామన్నారు. ఈ అంశంపై త్వరలో జరగనున్న మంత్రివర్గ సమావేశంలో చర్చిస్తామన్నారు. ప్రశ్నోత్తరాల పర్వంలో భాగంగా సభ్యులు దానం నాగేందర్, లక్ష్మారెడ్డి, జయధీర్ రెడ్డి, రాజ్ ఠాకూర్, బీర్ల ఐలయ్య, కసిరెడ్డి నారాయణ రెడ్డి, పాల్వాయి హరీశ్ బాబు, గండ్ర సత్యనారాయణ రావు, ధన్‌పాల్ సూర్యనారాయణ, పాయం వెంకటేశ్వర్లు, రాకేశ్ రెడ్డిలు ఇందిరమ్మ ఇండ్ల స్కీమ్ అమలుకు సంబంధించి పలు ప్రశ్నలను సంధించారు. ముఖ్యంగా ప్రస్తుతం ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి సుమారు మూడున్నర వేల ఇందిరమ్మ ఇండ్లను కేటాయించినా, అవేమీ సరిపోవడం లేదని, క్షేత్ర స్థాయిలో లబ్ధిదారులు ఎక్కువ మంది ఉన్నట్లు అదనంగా మరో వెయ్యి నుంచి మూడు వేల వరకు ఇందిరమ్మ ఇండ్లను కేటాయించాలని సభ్యులు కోరారు. ముఖ్యంగా ఈ స్కీమ్‌కు సంబంధించి సొంత భూమి లేకుండా, అద్దె ఇళ్లలో, పూరి గుడిసెల్లో నివాసముంటున్న లబ్దిదారులున్నారని వివరించారు. దీంతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇండ్లు అనేవి పేదల ఆత్మగౌరవాన్ని నిలబెట్టే గొప్ప స్కీమ్ అన్నారు. ఈ స్కీమ్ కింద ఇప్పటికే రెండు దఫాలుగా ఇండ్లను కేటాయించగా, మరో మూడు దఫాలుగా కూడా ఇండ్లను కేటాయించి, పేదలకు సొంతింటిని సమకూర్చేందుకు సర్కారు కట్టుబడి ఉన్నదన్నారు.

**బీఆర్ఎస్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరిట మోసం**

గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పేరుతో ప్రజలను మోసం చేసిందని మంత్రి పొంగులేటి అన్నారు. గత సర్కార్ డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణాన్ని వివిధ దశల్లో చేపట్టిన అర్ధాంతరంగా వదిలేయడంతో పాటు పూర్తి స్థాయిలో నిర్మాణం పూర్తయిన ఇండ్లు నిరుపయోగంగా పడి ఉన్నాయన్నారు. గత సంవత్సరం హౌసింగ్‌కు సంబంధించి రూ. 204 కోట్ల వరకు పెండింగ్ బిల్లులు పెట్టిందన్నారు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత 133 కాలనీల్లో 36 వేల ఇండ్లను సుమారు రూ.744 కోట్లతో నిర్మించి మౌలిక వసతులను కల్పించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న బిల్లులను కూడా క్లియర్ చేసినట్లు తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్ దత్తతకు తీసుకున్న వాసాలమర్రి గ్రామ వాసులకు ఇచ్చిన హామీలను కూడా నెరవేర్చలేదని, గత సర్కారు అసంపూర్తిగా వదిలేసిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను త్వరలోనే రూ.457 కోట్లతో మిగిలిన పనులు పూర్తి చేసి, లబ్దిదారులకు అందిస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు స్కీమ్ కింద 3 లక్షల ఇండ్ల నిర్మాణానికి గాను రూ.22 వేల 500 కోట్లు కేటాయించి, ఇప్పటి వరకు 50 వేల ఇండ్ల నిర్మాణాలను పూర్తి చేసి గృహప్రవేశాలు కూడా జరిగిపోయాయన్నారు. హౌసింగ్ లబ్దిదారులను సుమారు 20 లక్షల వరకు గుర్తించామని, ఆదివాసులు, చెంచులు నివసించే ఐటీడీఏ ప్రాంతాలకు 12 వేల 500 ఇండ్లను కేటాయించామని తెలిపారు. ఇలాంటి ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలను కేటాయించడంలో అటవీ శాఖతో కాస్త సమస్యలున్నాయని, వాటిని త్వరలోనే పరిశీలిస్తా మన్నారు.

**హౌసింగ్‌పై స్పెషల్ మీటింగ్**

**పెట్టాలి : స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్**

ఇందిరమ్మ ఇండ్ల స్కీమ్ అమలుకు సంబంధించి సభలో ఉన్న సభ్యులు అనేక రకాల సమస్యలను వెల్లడిస్తున్నారని, తన నియోజకవర్గానికి కేటాయించిన ఇందిరమ్మ ఇండ్లు ఇప్పటి వరకు 90 శాతం పూర్తయ్యాయని, మరో పది శాతమే మిగిలి ఉన్నాయంటూ సభ్యుల సందేహాలను నివృత్తి చేసేందుకు అసెంబ్లీ సెషన్ తర్వాత ఎమ్మెల్యేలతో ప్రత్యేకంగా మీటింగ్ పెట్టాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని స్పీకర్ ప్రసాద్ కుమార్ ఆదేశించారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన మంత్రి రానున్న వారం, పది రోజుల్లో సభ్యులతో స్పెషల్ మీటింగ్ ఏర్పాటు చేయనున్నట్లు సభా ముఖంగా వెల్లడించారు.



# మావోయిస్టు పార్టీకి కోలుకోలేని దెబ్బ

- పీఎల్జీఏ కమాండర్ దేవా, రాజిరెడ్డి
- సహా 20 మంది లొంగుబాటు
- 48 ఆయుధాలు, బుల్లెట్ల అప్పగింత
- తెలంగాణలో అంతమైన రాష్ట్ర కమిటీ
- పీఎల్జీఏ పని అయిపోయింది: డీజీపీ
- ఆపరేషన్ కగార్ దెబ్బకు ఉక్కిరిబిక్కిరి

హైదరాబాద్, (ప్రజాస్వరం):

మావోయిస్టు పార్టీకి మరో ఎదురు దెబ్బ తగిలింది. ఇటీవల ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన హిడ్మా సమకాలీకుడు, పీపుల్స్ వార్ గెరిల్లా ఆర్మీ (పీఎల్జీఏ) బెటాలియన్ కమాండర్ బడ్సే సుక్కా ఎలియాస్ దేవా శనివారం తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఆయనతో పాటు తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యునిగా ఉన్న కంకణాల రాజిరెడ్డి, మరో 18మంది మావోయిస్టులు కూడా సరెండర్ అయ్యారు. ఈ క్రమంలో పోలీసులకు మొత్తం 48 ఆయుధాలను అప్పగించారు. దేవా లొంగుబాటుతో పీఎల్జీఏ పూర్తిగా బలహీన పడినట్టే అని డీజీపీ శివధర్ రెడ్డి అన్నారు. ఇక, రాజిరెడ్డి సరెండర్‌తో తెలంగాణ రాష్ట్ర కమిటీ దాదాపుగా అంతం అయినట్టే అని చెప్పారు. ప్రస్తుతం ఈ కమిటీలో ఒక్కరు మాత్రమే ఉన్నట్లు తెలిపారు. జనజీవన స్రవంతిలో కలిసి రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన పిలుపు సత్ఫలితాలనిస్తోందని చెప్పారు.

**రెండో కీలక నేత**

ఛత్తీస్‌ఘఢ్‌రాష్ట్రం సుక్మా జిల్లా పువ్వర్తి గ్రామానికి చెందిన బడ్సే సుక్కా ఎలియాస్ దేవా మావోయిస్టు పార్టీలో రెండో కీలక గిరిజన నాయకుడని డీజీపీ శివధర్ రెడ్డి చెప్పారు. పువ్వర్తి గ్రామానికే చెందిన స్నేహితుడు హిడ్మా ప్రభావంతో దేవా 2003లో మావోయిస్టు పార్టీలో చేరాడని తెలిపారు. ఆయుధాల తయారీ, పేలుడు పదార్థాల సేకరణ, ఐఈడీ బాంబుల తయారీలో దేవా ఎక్స్‌పర్ట్ అని చెప్పారు. దాంతోపాటు మిలటరీ వ్యూహాలు రూపొందించటంలో కూడా ఆరితేరాడన్నారు. జెరాం ఘాటీలో పక్కా వ్యూహం ప్రకారం పేలుళ్లు జరిపి ఛత్తీస్‌ఘఢ్ రాష్ట్ర మంత్రి మహేంద్ర కర్మతోపాటు మరికొందరు కాంగ్రెస్ నాయకులను హతమార్చటంలో దేవాది కీలక పాత్ర అని తెలిపారు. ఈ క్రమంలో పీఎల్‌జీఏ బెటాలియన్‌కు తన తరువాత దేవానే నేతృత్వం వహిస్తాడని హిడ్మా ప్రకటించినట్టు చెప్పారు.

**75 లక్షల రివార్డు..**

పదుల సంఖ్యలో దాడులు, హత్యల కేసుల్లో నిందితునిగా ఉన్న దేవాపై తెలంగాణ, ఛత్తీస్‌ఘడ్, మహారాష్ట్రతోపాటు ఎన్ఐఏ ప్రకటించిన రివార్డు మొత్తం రూ.75 లక్షలుగా ఉందని డీజీపీ తెలిపారు. ఇక, లొంగిపోయిన మరో మావోయిస్టు రాజిరెడ్డి అలియాస్ వెంకటేశ్ తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడని చెప్పారు. కర్రెగుట్టల్లో గెరిల్లా బేస్‌ను ఏర్పాటు చేయటంలో రాజిరెడ్డి ప్రధాన పాత్ర పోషించినట్టు తెలిపారు. రాజిరెడ్డి లొంగుబాటుతో మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ దాదాపుగా తుడుచుకు పోయినట్టే అని చెప్పారు. ప్రస్తుతం దీంట్లో ఒక్క దామోదర్ (తెలంగాణ స్టేట్ కమిటీ సెక్రటరీ) మాత్రమే ఉన్నట్టు తెలియచేశారు. కాగా రాజిరెడ్డి భార్య అడ్లూరి ఈశ్వరీ అలియాస్ రామ్‌కో కూడా లొంగిపోయినట్టు డీజీపీ పేర్కొన్నారు.

**కగార్‌తో ఉక్కిరిబిక్కిరి**

మావోయిస్టు పార్టీని పూర్తిగా తుద ముట్టించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం జరుపుతున్న ఆపరేషన్‌కగార్‌తో ఆ పార్టీ ఉక్కిరిబిక్కిరవుతోందని డీజీపీ చెప్పారు. వేర్వేరు ఎన్‌కౌంటర్లలో ఇప్పటికే పలువురు అగ్రనేతలతోపాటు క్యాడర్ కూడా చనిపోయినట్టు తెలిపారు. దాంతో ఆ పార్టీ అగ్రనాయకత్వం ప్రాణాలు రక్షించుకోవటానికి ఇతర ప్రాంతాలకు తరలి వెళ్లాలని సూచిస్తున్నట్టు చెప్పారు. ఆయా ప్రాంతాల భౌగోళిక పరిస్థితులపై అవగాహన లేకపోవటం, దానికి తోడు ఆరోగ్య సమస్యలు వెంటాడుతుండటంతో మావోయిస్టులు లొంగిపోవటానికి సిద్ధపడుతున్నారని డీజీపీ వివరించారు. ఇటువంటి పరిస్థితుల్లో జనజీవన స్రవంతిలో కలిస్తే పునరావాస పథకాలను అందిస్తామంటూ రేవంత్ రెడ్డి చేసిన ప్రకటనతో వరుసగా మావోయిస్టులు లొంగిపోతున్నారన్నారు.





**దేశంలోనే తొలిసారిగా..**

లొంగిపోయిన మావోయిస్టులు మొత్తం 48 ఆయుధాలను పోలీసులకు అప్పగించారు. దీంట్లో 2 లైట్ మిషన్‌గన్లు, యూఎస్‌లో తయారైన కోల్ట్ రైఫిల్, ఇజ్రాయిల్లో తయారైన టవర్ రైఫిల్, 8 ఏకే47 రైఫిళ్లు, 10 ఇన్సాస్ రైఫిళ్లు, 8 ఎస్ఎల్ఆర్ రైఫిళ్లు, 4 బీజీఎల్, 11 సింగిల్ షాట్‌వెపన్స్, 2 గ్రనేడ్లు, ఒక ఎయిర్ గన్ ఉన్నాయి. వీటితోపాటు 2,206 బుల్లెట్లను కూడా అప్పగించారు. ఇటీవలి కాలంలో మావోయిస్టులు ఇన్ని ఆయుధాలను అప్పగించటం దేశంలోనే ఇదే మొదటిసారని శివధర్ రెడ్డి చెప్పారు. ఇక, మావోయిస్టుల నుంచి రూ. 20 లక్షల నగదును కూడా స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఆయుధాలు అప్పగించినందుకుగాను లొంగిపోయిన మావోయిస్టులకు కోటీ 81 లక్షల 90 వేల రూపాయల నగదును పంచి ఇవ్వనున్నట్టు డీజీపీ చెప్పారు. మావోయిస్టులపై ఇప్పటికే రివార్డులుగా ప్రకటించిన మొత్తాన్ని కూడా వారికే ఇవ్వనున్నామన్నారు. మావోయిస్టుల లొంగుబాటు కోసం వ్యూహాత్మకంగా వ్యవహరించిన ఎస్ఐబీ అధికారులు, సిబ్బందిని ఈ సందర్భంగా అభినందించారు. మావోయిస్టు పార్టీలో మిగిలి ఉన్నవారు కూడా లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలవాలని, ప్రభుత్వం అన్ని సహాయ సహకారాలు అందిస్తుందని డీజీపీ పేర్కొన్నారు. 'పోరు వద్దు.. ఊరు ముద్దు' అన్న పిలుపును డీజీపీ ఈ సందర్భంగా గుర్తు చేశారు.

**దేవ్ జీ ఎక్కడున్నారో తెలియదు**

మావోయిస్టు అగ్రనేత తిప్పిరి తిరుపతి ఆచూకీపై ఆ పార్టీ మాజీ నేత కంకణాల రాజిరెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్ జీ ప్రస్తుతం ఎక్కడున్నారన్న సమాచారం తమ వద్ద లేదని శనివారం పోలీసుల ఎదుట లొంగిపోయిన సందర్భంగా ఆయన పేర్కొన్నారు. తాను పార్టీని వీడి రావడానికి ప్రధానంగా ఆరోగ్య సమస్యలే కారణమని రాజిరెడ్డి తెలిపారు. దీనికి తోడు తెలంగాణ ప్రభుత్వం, ముఖ్యమంత్రి ఇచ్చిన పిలుపు తమను ఆలోచింపజేసిందని, అందుకే జనజీవన స్రవంతిలో కలిసేందుకు మొగ్గు చూపామని ఆయన వెల్లడించారు.

# ప్రాధాన్యతను బట్టి ప్రాజెక్టుల బిల్లులు

- ఎస్ఎల్బీసీ టన్నెల్‌పై ప్రజా ప్రభుత్వం స్పెషల్ ఫోకస్
- నిధులున్నాయ్.. బిల్లుల ఆలస్యానికి కాంట్రాక్టర్లే కారణం
- పాలమూరు, కృష్ణా ప్రాజెక్టులపై సీఎం రేవంత్ పర్యవేక్షణ
- అసెంబ్లీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కీలక ప్రకటన

హైదరాబాద్, (ప్రజాస్వరం):

కృష్ణానదిపై ఉన్న ప్రాజెక్టులు, ముఖ్యంగా పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకం సహా అన్నింటిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా సమీక్షలు నిర్వహించారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అసెంబ్లీలో వెల్లడించారు. ఎస్ఎల్బీసీ టన్నెల్‌కు సంబంధించి ప్రజా ప్రభుత్వం చాలా సీరియస్‌గా పని చేస్తోందని ఆయన స్పష్టం చేశారు. ప్రాజెక్టుల ప్రాముఖ్యతను ఆధారంగా చేసుకుని బిల్లులు ఎప్పటికప్పుడు విడుదల చేయాలని ముఖ్యమంత్రి ఇప్పటికే ఆదేశాలు ఇచ్చారని సభకు వివరించారు. ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కృష్ణానది ప్రాజెక్టులపై నిరంతరం సమీక్షలు జరుపుతున్నారని భట్టి విక్రమార్క తెలిపారు. పెండింగ్ బిల్లుల క్లియరెన్స్ కోసం ఆర్థిక శాఖతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతున్నారని పేర్కొన్నారు. పెండింగ్ బిల్లుల విషయంలో ప్రభుత్వం వద్ద ఎటువంటి ఇబ్బందులు లేవని భట్టి విక్రమార్క సభలో స్పష్టంగా చెప్పారు. బిల్లుల క్లియరెన్స్‌లో కాంట్రాక్టర్ల వైపు నుంచే ఆలస్యం జరుగుతోంది తప్ప, ప్రభుత్వం నిధులు విడుదల చేయడానికి సిద్ధంగా ఉందని ఆయన వివరించారు.



# పంచాయతీ సవరణ బిల్లులకు ఆమోదం

మొదటిపేజీ తరువాయి



చట్ట సవరణ బిల్లులపై స్పీకర్ చర్చకు అనుమతించారు. ఈ సందర్భంగా అధికార పార్టీ సభ్యుడు ఆది నారాయణ మాట్లాడుతూ, ఇద్దరు పిల్లల కన్నా ఎక్కువ మంది పిల్లలుంటే ఎన్నికకు అనర్హులుగా పరిగణించే పంచాయతీరాజ్ నిబంధనను సడలిస్తూ నిర్ణయం తీసుకుని, బిల్లులను అసెంబ్లీలో ప్రవేశపెట్టినందుకు ఈ రోజు గొప్ప రోజు అని వ్యాఖ్యానించారు. ఈ సవరణ బిల్లులకు తాను పూర్తిగా మద్దతు పలుకున్నట్లు స్పష్టం చేశారు. బీజేపీ సభ్యుడు వెంకట రమణ రెడ్డి మాట్లాడుతూ, ఇద్దరు పిల్లల కన్నా ఎక్కువ మంది పిల్లలుంటే పోటీకి అనర్హులుగా పరిగణించే ఈ నిబంధనను గతంలో మున్సిపల్‌లో ఎత్తి వేశారని గుర్తు చేశారు. ఇప్పుడు ఈ నిబంధనను సడలిస్తూ చట్ట సవరణ చేయాలని భావిస్తున్న సర్కారు మరోసారి ఈ విషయాన్ని పరిశీలించాలని, సవరించాలని భావించడం సభ్యత కాదని వ్యాఖ్యానించారు. పొలిటికల్ బెనిఫిట్స్‌కు ప్రాధాన్యత ఇవ్వడం సరికాదన్నారు. బీజేపీ సభ్యుడు పాల్వాయి హరీశ్ బాబు మాట్లాడుతూ, పంచాయతీ రాజ్ చట్టసవరణ బిల్లులను తాము సమర్థించడం లేదన్నారు. తమ నియోజకవర్గంలో తాను ఉచ్చరించేందుకు కూడా ఇష్టపడని పేరుతో ఉన్న ఓ ప్రాంతం పేరును నందిగూడగా మార్చాలని సభను కోరారు. దీంతో పాటు వనపర్తి జిల్లాలోని జైన్ తిరుమలాపూర్ ప్రాంతం పేరును జయన్న తిరుమలాపూర్‌గా మార్చాలని ప్రతిపాదించారు. లంబాడీ మిట్టి అంటూ మరో గ్రామం పేరు ఉన్నదని, దాన్ని ప్రేమ్‌నగర్‌గా మార్చాలని కోరారు. అధికార పార్టీ సభ్యుడు రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ, తమ జిల్లాలోని దోమ మండలం పరిధిలో దొంగల ఎన్కేపల్లి పేరిట ఓ గ్రామం ఉందని, వాస్తవానికి ఆ గ్రామంలో విద్యావంతులు, మేధావులుంటారని, ఆ గ్రామం పేరు దొంగల ఎన్కేపల్లి అంటూ పడిపోయిందని, ఆ పేరును సంజీవనగర్‌గా మార్చాలని సభాముఖంగా కోరారు. సీపీఐ శాసన సభ పక్ష నేత కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ, ఇద్దరు పిల్లల కన్నా ఎక్కువ మంది పిల్లలు ఉంటే పంచాయతీ ఎన్నికలకు అనర్హులుగా ఉన్న నిబంధనను సవరించటం మంచి పద్ధతి కాదన్నారు. ఇద్దరు పిల్లలుంటే పోటీకి అనర్హులనే నిబంధననే తాము బలపరుస్తున్నామని స్పష్టం చేశారు. జనాభాలో ఎక్కువ వయస్సు కలిగిన వారు పెరుగుతున్నారన్న ఆందోళన వ్యక్తమైన నేపథ్యంలో జనాభా స్వీయ నియంత్రణపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ, జనాభా స్వీయ నియంత్రణపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్న అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఆ తర్వాత సభ పంచాయతీరాజ్ సవరణ బిల్లులను ఆమోదించినట్లు స్పీకర్ ప్రకటించారు. ఆయా గ్రామాలు, ప్రాంతాల పేర్ల మార్పు విషయంపై త్వరలోనే కలెక్టర్ల నుంచి తగిన ఆదేశాలు జారీ చేయించనున్నట్లు మంత్రి వెల్లడించారు.

# సభా సంప్రదాయాలకు కాంగ్రెస్ భంగం

మొదటిపేజీ తరువాయి

ప్రెజెంటేషన్ నిర్వహిస్తే, అది భారతదేశ పార్లమెంట్ సంప్రదాయాలకు విరుద్ధం. అందుకే మేము సభకు హాజరుకాబోము అని మీరు సంతకం చేసిన ఉత్తరం గుర్తుందా? లేదా? అదే ఉత్తమ్ నేడు మంత్రి హోదాలో అసెంబ్లీ హాల్లో ప్రెజెంటేషన్‌కు సిద్ధపడటం రాజకీయ ద్వంద్వ వైఖరికి నిదర్శనం. ఈ ఉత్తరంపై నేటి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే పద్మావతి కూడా సంతకాలు చేశారు., కాంగ్రెస్ అనైతికతను బట్టబయలు చేయడానికి ఈ ఒక్క ఉత్తరం చాలు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విలువలు, రాజ్యాంగం, పార్లమెంట్ స్ఫూర్తి లాంటి మాటలు వల్లెవేసి, అధికారంలోకి రాగానే అదే విలువలకు తిలోదకాలు ఇవ్వడం కాంగ్రెస్ అసలు నైజం. అధికార పక్షానికి ప్రెజెంటేషన్‌కు అనుమతి ఇచ్చినప్పుడు, బీఆర్ఎస్‌కూ అదే విధంగా అనుమతి ఇవ్వాలని స్పీకర్‌ను బీఏసీ సమావేశంలో కోరినా తిరస్కరించారు. ఇదే కాంగ్రెస్‌కు, బీఆర్ఎస్‌కు మధ్య ఉన్న తేడా. ఆ మార్పు అసలు అర్థం ఏమిటో ప్రజలు ఇప్పుడు స్పష్టంగా అర్థం చేసుకుంటున్నారు' అని మాజీ మంత్రి పేర్కొన్నారు.



# కృష్ణ బేసిన్ జల ద్రోహి బీఆర్ఎస్

మొదటిపేజీ తరువాయి

ప్రాంతంలో 73 శాతానికి పైగా భూభాగం తెలంగాణలోనే ఉందని, కాబట్టి న్యాయమైన వాటా దక్కాల్సిందేనని స్పష్టం చేశారు. నదీ జలాల సమస్యలపై పరిష్కారానికి ఎవరితోనైనా చర్చకు తాము సిద్ధమని ఈ సందర్భంగా మంత్రి ప్రకటించారు.

**పాలమూరుపై కేసీఆర్ మోసం**

పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు రూ. 83 వేల కోట్లకు పైగా ఖర్చు అవుతోందని, అయితే మూడేళ్లలో పూర్తి కావాల్సిన ఈ ప్రాజెక్టులో గత ప్రభుత్వం కేవలం 35 శాతం పనులే పూర్తి చేసిందని ఉత్తమ్ విమర్శించారు. కుర్చీ వేసుకుని కూర్చుంటా అని కేసీఆర్ అన్నారని, ఆ కుర్చీ ఎక్కడ పోయిందో, ఎక్కడికి వెళ్లారో చెప్పాలని ఆయన ఎద్దేవా చేశారు. మూడేళ్లలో ప్రాజెక్టు పూర్తి చేస్తానని చెప్పి ప్రజలను మోసం చేశారని మంత్రి ఆరోపించారు. కృష్ణా బేసిన్ ప్రాజెక్టులకు రూ. 41 వేల కోట్లు ఖర్చు చేసిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం, గోదావరి బేసిన్ ప్రాజెక్టులకు మాత్రం రూ. 1.20 లక్షల కోట్లను వెచ్చించిందని మంత్రి వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో ఒక్క టీఎంసీ కూడా అదనంగా పెంచలేకపోయారని విమర్శించారు. అదే సమయంలో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో 1.5 టీఎంసీల సామర్థ్యాన్ని 1 టీఎంసీకి తగ్గించి అన్యాయం చేశారని ఉత్తమ్ మండిపడ్డారు.

**చారిత్రక తప్పిదాలను సవరిస్తున్నాం**

ఏపీ, తెలంగాణ మధ్య కృష్ణా నదీ జలాలపై బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పు త్వరలో వెలువడనుందని మంత్రి తెలిపారు. తాను స్వయంగా ట్రిబ్యునల్ వాదనలకు హాజరవుతున్నానని, కృష్ణా జలాల్లో తెలంగాణకు 72 శాతం (814 టీఎంసీల్లో న్యాయమైన వాటా) కేటాయింపులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. 2016లో కేసీఆర్ 299 టీఎంసీలకే ఒప్పుకుని చారిత్రక తప్పిదం చేశారని, దానిని తాము సవరించే ప్రయత్నం చేస్తున్నామని వెల్లడించారు. ఈ టర్మ్‌లోనే కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టుకు 2015లో జీవో ఇచ్చి, డీపీఆర్ సమర్పించడానికి ఏడేళ్లు సమయం తీసుకున్నారని మంత్రి మండిపడ్డారు. జూరాల నుంచి నీళ్లు తెస్తే రూ. 32 వేల కోట్లతో పూర్తయ్యే ప్రాజెక్టును, శ్రీశైలంకు మార్చడం వల్ల వ్యయం రూ. 80 వేల కోట్లకు పెరిగిందని విమర్శించారు. కేసీఆర్ 90 శాతం పనులు అన్నారని, కానీ జరిగింది 30 శాతమేనని ఎద్దేవా చేశారు. ఇంకా 17 క్లియరెన్సులు రావాల్సి ఉందని, 39 వేల ఎకరాల భూసేకరణ పెండింగ్‌లో ఉందని తెలిపారు.

**ఏపీ ప్రాజెక్టులపై పోరాటం..**

పోలవరంనల్లమల ప్రాజెక్టుకు సీడబ్ల్యూసీ అనుమతి లేదని, దీనిపై సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ వేశామని మంత్రి చెప్పారు. ఏపీ ప్రభుత్వం గోదావరి జలాలను తరలించే ప్రయత్నాలను అడ్డుకుంటామన్నారు. అలాగే ఎస్ఎల్బీసీ టన్నెల్ వర్క్సను మూడేళ్లలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం కల్వకుర్తి, భీమా వంటి ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసిందని, తాము కృష్ణా బేసిన్ రైతులకు న్యాయం చేసిన తర్వాతే ఔటర్ బేసిన్‌కు నీటిని తీసుకెళ్లేలా ట్రిబ్యునల్ ముందు వాదనలు వినిపిస్తున్నామని వెల్లడించారు.

**అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం**

సభలో శనివారం ఏపీ ప్రభుత్వం నిర్మించబోతున్న పోలవరంనల్లమల ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వకూడదని, అదే సమయంలో పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి అన్ని రకాల అనుమతులు ఇవ్వాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం కీలక తీర్మానం ప్రవేశపెట్టింది. ఉత్తమ్ ప్రవేశపెట్టిన ఈ తీర్మానాన్ని సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా తీవ్ర కరువు ప్రాంతమని, ఇక్కడి పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని చేపట్టిన పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టును సత్వరమే పూర్తి చేయాల్సిన అవసరం ఉందని సభ అభిప్రాయపడింది. రాష్ట్ర ఏర్పాటు తర్వాత గత పదేళ్లలో పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టు నిర్మాణంలో సరైన పురోగతి లేకపోవడం వల్ల అంచనాలు, నిర్మాణ వ్యయాలు విపరీతంగా పెరిగిపోయాయని తీర్మానంలో పేర్కొన్నారు. 90 టీఎంసీల సామర్థ్యంతో తాగు మరియు సాగునీటి కోసం చేపట్టిన ఈ స్కీంకు సంబంధించిన అన్ని అనుమతులను కేంద్ర ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని శాసనసభ కోరింది. ఇరు రాష్ట్రాల మధ్య ఉన్న అంతర్రాష్ట్ర జల వివాదాలన్నీ పరిష్కరించే వరకు ఏపీ ప్రభుత్వం చేపట్టబోతున్న పోలవరంబనకచర్ల లింక్ ప్రాజెక్టు లేదా పోలవరంనల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టులకు ఎలాంటి అనుమతులు ఇవ్వరాదని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ సభ ఏకగ్రీవంగా తీర్మానించింది. గోదావరి జలాలను ఏ రూపంలో తరలించినా అనుమతించకూడదని స్పష్టం చేసింది. ఈ తీర్మానం కాపీలను కేంద్ర ప్రభుత్వానికి పంపనున్నట్లు సమాచారం.

**100 పేజీలతో పీపీటీ**

కృష్ణా నదీ జలాలపై జరిగిన స్వల్పకాలిక చర్చలో ఉత్తమ్ వినూత్నంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. సభలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రెండు పెద్ద ఎల్ఈడీ స్క్రీన్ల ద్వారా 100 పేజీలతో కూడిన సమగ్ర వివరాలను సభ్యులకు వివరించారు. సుమారు గంటన్నరకు పైగా సాగిన ఈ ప్రజెంటేషన్‌లో 2014 నుంచి 2023 వరకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరించిన నీటిపారుదల విధానాలను మంత్రి ఎండగట్టారు. గత పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం ఒక్క ప్రాజెక్టును కూడా పూర్తి చేయలేకపోయిందని మంత్రి విమర్శించారు. చేసిన ఒకే ఒక్క ప్రాజెక్టు కాళేశ్వరం కూడా ఏడాదిలోపే కూలిపోయిందని ఆరోపించారు. నదీ జలాల పంపకాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి బీఆర్ఎస్ ప్రభుత్వం సహకరించిందనే అంశాన్ని ఒప్పందాల ఆధారంగా వివరించారు. ఉమ్మడి పాలమూరు, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాలకు వరప్రదాయని అయిన ప్రాజెక్టులను పూర్తి చేయడంలో గత ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించిందని మంత్రి మండిపడ్డారు. కేవలం డీపీఆర్ సిద్ధం చేయడానికే ఏడేళ్ల సమయం తీసుకున్నారని, ఇది ఆ జిల్లాల పట్ల గత పాలకులకు ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తుందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టుల ప్రస్తుత పరిస్థితిని, నదీ జలాల్లో కుదుర్చుకున్న ఒప్పందాల వల్ల తెలంగాణకు జరిగిన నష్టాన్ని ఆయన సుదీర్ఘంగా వివరించారు.

**సభ వాయిదా**

శాసనసభ సమావేశాలను సోమవారానికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ శనివారం ప్రకటించారు. సోమవారం ఉదయం 10 గంటలకు తిరిగి సభ ప్రారంభమవుతుందని ఆయన వెల్లడించారు. అంతకు ముందు శనివారం నాటి సమావేశాల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు కీలక బిల్లులను సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. తెలంగాణ (పబ్లిక్ సర్వీస్ నియామకముల క్రమబద్ధీకరణ, సిబ్బంది తీరు, వేతన స్వరూపము) (సవరణ) బిల్లు 2026 : ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు, సిబ్బంది వేతనాలకు సంబంధించి చేసిన సవరణలకు సభ ఆమోదం తెలిపింది. తెలంగాణ (రెండవ సవరణ) బిల్లు 2026: ఇదే అంశంపై ఉన్న రెండవ సవరణ బిల్లును కూడా సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. తెలంగాణ పంచాయతీ రాజ్ (సవరణ) బిల్లు 2026 : స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ, అభ్యర్థుల అర్హతలకు సంబంధించి ఈ సవరణను ప్రభుత్వం తీసుకొచ్చింది. పంచాయతీ రాజ్ (రెండవ సవరణ) బిల్లు 2026: ముఖ్యంగా స్థానిక ఎన్నికల్లో పోటీ చేసే వారికి ఉన్న ఇద్దరు పిల్లల నిబంధనను తొలగించేలా ఈ సవరణలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఈ సవరణ బిల్లుల ఆమోదంతో రాబోయే పంచాయతీ, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ఉన్న అడ్డంకులు తొలగినట్లయింది. రాష్ట్రంలో తగ్గుతున్న సంతానోత్పత్తి రేటును దృష్టిలో ఉంచుకుని ఇద్దరు పిల్లల నిబంధనను ఎత్తివేస్తూ మంత్రి సీతక్క ఈ బిల్లులను ప్రవేశపెట్టగా, సభ దీనిని స్వాగతించింది.





## కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి సలహాలు ఇస్తారని భావించాను


- కేసీఆర్ నదీ జలాల గురించి మాట్లాడారన్న ముఖ్యమంత్రి
- ఆయన చెప్పినందువల్లే నదీ జలాల అంశాన్ని చర్చకు పెట్టామని వెల్లడి
- రెండేళ్లుగా కేసీఆర్ సభకు రాకపోవడం విచారకరమని వ్యాఖ్య

హైదరాబాద్, (ప్రజాస్వరం):

మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నదీ జలాల గురించి మాట్లాడితే, ఆయన సభకు వచ్చి రాష్ట్రానికి ఉపయోగపడే సలహాలు ఇస్తారని భావించానని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. నదీ జలాలపై కేసీఆర్ మాట్లాడిన వెంటనే అసెంబ్లీలో చర్చకు పెట్టామని, కానీ ఆయన మాత్రం సభకు రాలేదని అన్నారు. శాసనసభలో 'నీళ్లునిజాలు'పై జరిగిన స్వల్పకాలిక చర్చలో భాగంగా ముఖ్యమంత్రి మాట్లాడారు. కృష్ణా నది ప్రాజెక్టులపై ప్రజలకు వాస్తవాలు తెలియాల్సి ఉందని ఆయన అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో, గత పదేళ్లలో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు అన్యాయం జరిగిందని తెలిపారు. అందుకే అనుభవం కలిగిన నాయకుడిగా కేసీఆర్ సభకు వచ్చి సలహాలు, సూచనలు చేస్తారని భావించానని అన్నారు. బయట సభల్లో, కార్యాలయాల్లో మాట్లాడే మాటల కంటే అసెంబ్లీలో మాట్లాడే మాటలకు విలువ ఉంటుందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రెండేళ్లుగా ప్రతిపక్ష నాయకుడు సభకు రాకపోవడం విచారకరమని ఆయన అన్నారు. గతంలో బీఆర్ఎస్ నేతలు అవమానించినా కాంగ్రెస్ నేతలు సభకు వచ్చి మాట్లాడేవారని తెలిపారు. ప్రతిపక్ష నేతలు అసెంబ్లీలో మాట్లాడకపోతే అంతిమంగా ప్రజలకే అన్యాయం జరుగుతుందని ఆయన అన్నారు. కృష్ణా జలాలపై చర్చను తెరపైకి తెచ్చిందే కేసీఆర్ అని గుర్తు చేశారు. కానీ ఆయనకు చట్టసభలంటే చిన్నచూపు అని విమర్శించారు.

## వెనెజులాపై అమెరికా సైనిక చర్య

- రాజధాని కారకాస్‌పై దాడులు
- మిసైళ్లు, బాంబుల వర్షం
- యూఎస్ అదుపులో అధ్యక్షుడు నికోలస్ మదురో
- ధృవీకరించిన డొనాల్డ్ ట్రంప్



న్యూయార్క్, (ప్రజాస్వరం) :

వెనెజులాపై అమెరికా విరుచుకుపడింది. రాజధాని కారకాస్ సిటీపై మిసైళ్లు, బాంబుల వర్షం కురిపించింది. వెనెజులాపై ఎయిర్ స్ట్రైక్స్ చేసింది తామేనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. అంతేకాదు, వెనెజులా అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన భార్య సిలియా ఫ్లోర్స్ తమ అదుపులో ఉన్నట్టు స్పష్టం చేశారు. కళ్లకు గంతలు కట్టి మదురోను ఓ చోట కూర్చోబెట్టిన ఫోటోను విడుదల చేశారు. డ్రగ్స్ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకే వెనెజులాపై అమెరికా సైనిక చర్యకు పాల్పడినట్టు సమాచారం. 1989 తర్వాత ఒక లాటిన్ అమెరికన్ దేశంలో అమెరికా నేరుగా జోక్యం చేసుకోవడం ఇదే తొలిసారి. గతంలో పనామాపై దాడి చేసింది. మిలిటరీ నేత మాన్యుయెల్ నోరిగాను పదవి నుంచి దింపేసింది. ఆ తర్వాత ఇన్నాళ్లకు వెనెజులాపై విరుచుకుపడింది. మదురోను పట్టుకోవడంతో వెనెజులాలో తమ సైనిక చర్య పూర్తయిందని అమెరికన్ వర్గాలు తెలిపాయి.

**వెనెజులా అధ్యక్షుడి అరెస్టుతో ప్రజల సంబురాలు**

మదురో అరెస్ట్ నేపథ్యంలో అక్కడి ప్రజలు రోడ్లపై సంబురాలు చేసుకున్నారు. వెనిజులా పౌరులు వీధుల్లో నృత్యాలు చేస్తూ, వేడుకలు జరుపుకుంటూ తమను విముక్తి చేసినందుకు అధ్యక్షుడు ట్రంప్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## హ్యాష్ ఆయిల్ స్థావరం పై మేడ్చల్ ఎస్ఓటి పోలీసుల దాడి...ముగ్గురు అరెస్ట్





కుత్బుల్లాపూర్ జనవరి 03(ప్రజాస్వరం):

దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గండి మైసమ్మ లో ఓ ఇంట్లో గుట్టు చప్పుడు కాకుండా రహస్యంగా తయారు చేస్తున్న గంజాయి హ్యాష్ ఆయిల్ ను మేడ్చల్ ఎస్ఓటి పోలీసులు పట్టుకున్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కు చెందిన సునీల్ కుమార్ (27), చింటూ (27), సూర్యకాంత్ (26) ముగ్గురు వ్యక్తులు అరెస్ట్ చేశారు. దుండిగల్ పోలీస్ ల వివరాలు తెలిపిన ప్రకారం ఒడిషా నుండి హ్యాష్ ఆయిల్ ను తెప్పించి గండి మైసమ్మ చౌరస్తాలోని ఓ ఇంట్లో గుట్టుచప్పుడు కాకుండా విక్రయిస్తున్నారని సమాచారంతో మేడ్చల్ ఎస్ఓటి పోలీసులు దాడి చేశారని దుండిగల్ పోలీసులు తెలిపారు. ఒడిషా నుండి హ్యాష్ ఆయిల్ ను పెద్ద మొత్తంలో తెప్పించుకొని చిన్న చిన్న బాటిళ్లలో నింపి వాటిని అమ్మడానికి ప్రయత్నించారని తెలిపారు. 9లక్షలు విలువ చేసే హ్యాష్ ఆయిల్ సీజ్ చేశారు. నిందితుల దగ్గర నుండి గంజాయి నూనె బరువు 1.3 కిలోలు, 03 వివో మొబైల్ ఫోన్లు, పల్సర్ బైక్ నెం. TS08GW5586 స్వాధీన పరుచుకున్నారు. నిందితుల పై దుండిగల్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించారు. మేడ్చల్ జోన్ డిసిపి ఎస్ఓటి శోభన్ కుమార్, మేడ్చల్ జోన్ అదనపు డిసిపి విశ్వప్రసాద్, ఎస్ఓటి సీఐ శ్యామ్ సుందర్ రెడ్డి, అతని బృందం మరియు సైబరాబాద్ దుండిగల్ పోలీస్ డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ ఎం. బాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సావిత్రిబాయి పూలే చిత్రపటానికి ఘనంగా నివాళులు.

- కరీంనగర్ టిఆర్పీ కార్యలయంలో పార్టీ నాయకులతో సమావేశం.
- ఏర్పాటు చేసిన జిల్లా అధ్యక్షులు గంగిపెల్లి అరుణ.
- మహనీయ సామాజిక సంస్కర్త సావిత్రిబాయి సేవలు...
- చిరస్మరణీయమని గుర్తుచేసిన రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా.

కరీంనగర్, జనవరి 03(ప్రజాస్వరం):

కరీంనగర్ జిల్లా తెలంగాణ రాజ్యాధికార పార్టీ కార్యాలయంలో సావిత్రి బాయి పూలె జయంతి సందర్భంగా జిల్లా అధ్యక్షులు గంగిపెల్లి అరుణ పార్టీ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన కార్యక్రమానికి టిఆర్పీ రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా హాజరై తోటి నాయకులతో కలిసి మహనీయురాలైన సావిత్రి బాయి పూలె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించి ఆమె సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా మాట్లాడుతూ, భారతదేశంలో మహిళా విద్యకు బాటలు వేసిన తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రి బాయి పూలె అని, సామాజిక వివక్ష, లింగ అసమానతలను ఎదుర్కొని విద్య ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమని నిరూపించిన గొప్ప మహనీయురాలు సావిత్రి బాయి పూలే అని పేర్కొన్నారు. ఆడ పిల్లల విద్య కోసం ఆమె చేసిన పోరాటం నేటి తరాలకు ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. అంతేకాకుండా, వెనుకబడిన వర్గాలు, మహిళలు, దళితుల అభ్యున్నతికి ఆమె చేసిన సేవలు మరువలేనివని, ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ప్రతి సామాజిక కార్యకర్త, రాజకీయ నాయకుడి బాధ్యత అని అఖిల్ పాషా తెలిపారు. అనంతరం జిల్లా అధ్యక్షులు గంగిపెల్లి అరుణ మాట్లాడుతూ తెలంగాణ రాజ్యాధికార పార్టీ కూడా సావిత్రి బాయి పూలె ఆశయాలకు అనుగుణంగా సమానత్వం, సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. మహిళలు సావిత్రి బాయి పూలే జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని అన్ని రంగాల్లో ముందుకు రావాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిఆర్పీ మహిళా విభాగం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ చాంద్ పాషా, టౌన్ మహిళ అధ్యక్షురాలు జింక లావణ్య, గంగాధర మండల మహిళ అధ్యక్షులు పల్లవి, కొత్తపెల్లి మండల అధ్యక్షులు ఓర్సు రాజు, టౌన్ ప్రధాన కార్యదర్శి రమేష్, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ మహబూబ్ అలీ, కొత్తపెల్లి మహిళ మండల అధ్యక్షురాలు ఓర్సు విమల, ప్రధాన కార్యదర్శి బోయిని చిత్ర, తిమ్మాపూర్ మండల మహిళ నాయకురాలు గీత, నాయకులు కోట సమ్మయ్య, ధారంగుల గణేష్, ఆలకుంట్ల గణేష్, రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.



## శంకర్‌పల్లి ఎస్సీ బాలికల వసతి గృహంలో ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు


శంకర్‌పల్లి జనవరి 03(ప్రజాస్వరం):

శంకర్‌పల్లి ఎస్సీ బాలికల వసతి గృహంలో శనివారం సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు విద్యార్థుల సమక్షంలో వార్డెన్ జయప్రద ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. అనంతరం హాస్టల్ వార్డెన్ జయప్రద సావిత్రి బాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జయప్రద మాట్లాడుతూ భారతదేశ తొలి మహిళ ఉపాధ్యాయురాలు అని తెలిపారు. సావిత్రిబాయి పూలే అడుగుజాడల్లో ప్రతి మహిళ నడవాలని హాస్టల్ వార్డెన్ జయప్రద పిలుపునిచ్చారు.



## స్టడీ టూర్‌పై రాజకీయ నాటకం

- బీఆర్ఎస్ వైఫల్యాలపై కాంగ్రెస్ స్పందన
- ఎమ్మెల్యే కృష్ణారావు వ్యాఖ్యలకు కాంగ్రెస్ నేత యుగంధర్ రెడ్డి కౌంటర్



కూకట్ పల్లి, జనవరి 03(ప్రజాస్వరం):

కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శుక్రవారం మీడియా సమావేశంలో చేసిన వ్యాఖ్యలకు కాంగ్రెస్ పార్టీ కూకట్ పల్లి నేత మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి తీవ్రంగా ప్రతిస్పందించారు. ఎమ్మెల్యే ఆరోపణలు వాస్తవాలకు దూరమని, ప్రజలను మభ్యపెట్టే రాజకీయ నాటకమేనని ఆయన మండిపడ్డారు. ఈ సందర్భంగా యుగంధర్ రెడ్డి శనివారం ఆయన పత్రికా ప్రకటనను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పదేళ్లుగా కూకట్ పల్లిని ఏలిన బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు ఏమిచ్చారో చెప్పాలనీ, అభివృద్ధి పేరుతో వేల కోట్ల భూములు ఎవరి చేతుల్లోకి వెళ్లాయో, ఎవరు లాభపడ్డారో ప్రజలకు తెలుసునని విమర్శించారు. మూడు కమిషనర్లు, నియోజకవర్గం ముక్కలు చేశారన్న ఆరోపణలు హాస్యాస్పదమని, పరిపాలనా సంస్కరణల కోసమే ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుందని ఆయన స్పష్టం చేశారు. పాలన మెరుగుపడాలంటే అధ్యయనం అవసరమని బీఆర్ఎస్ హయాంలో విదేశీ టూర్ల పేరుతో జరిగిన ఖర్చులపై ఎప్పుడైనా సమాధానం చెప్పారా? అంటూ ప్రశ్నించారు. ప్రజాధనం దుర్వినియోగం గురించి మాట్లాడే అర్హత బీఆర్ఎస్ నేతలకు లేదని, వాటర్ గ్రిడ్, మిషన్ భగీరథ, డబుల్ బెడ్‌రూం ఇళ్ల పేరుతో జరిగిన అవినీతులపై విచారణ భయంతోనే ఈ ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలోనే టెండర్లు వేసి, నిధులు సరిగా విడుదల చేయక పనులు నిలిచిపోయాయని, ఆ తప్పిదాలన్నీ కాంగ్రెస్ ఖాతాలో వేయడం రాజకీయ మోసమని మండిపడ్డారు. కేసీఆర్ పాలన సంక్షేమ ప్రభుత్వమని చెప్పుకోవడం విడ్డూరమని, ప్రజలు మోసపోవడం లేదు. గత పదేళ్ల పాలనను, నేటి ప్రభుత్వ ప్రయత్నాలను తూకం వేసే స్థాయికి ప్రజాస్వామ్యం ఎదిగిందన్నారు. బీఆర్ఎస్ బెదిరింపులు, ఆరోపణల రాజకీయానికి రోజులు చెల్లాయని, కూకట్‌పల్లి అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.



## ఘనంగా సావిత్రి భాయి పూలే జయంతి వేడుకలు

**కూకట్ పల్లి, జనవరి 03(ప్రజాస్వరం):**

కూకట్ పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్ పరిధిలోని రాజు కాలనీ లో శనివారం సావిత్రి భాయి పూలే జయంతిని పురస్కరించుకుని శనివారం బాలానగర్ డివిజన్ లోని రాజుకాలనీలోని డా.బి.ఆర్. అంబేద్కర్ భవన్ లో తెలంగాణ దళిత సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సావిత్రి భాయి పూలే చిత్రపటానికి తెలంగాణ దళిత సంక్షేమ సంఘం ముఖ్య సలహాదారుడు నల్లా విల్సన్, సలహాదారులు మాదాసు నర్సింహులు, మల్లిగారి లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి చింతా నర్సింగ్ రావు పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

## ఇందుర్తి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు

**చిగురుమామిడి, జనవరి 03(ప్రజాస్వరం):**


చిగురుమామిడి మండలం ఇందుర్తి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో మహిళల కోసం నిర్వహించిన ముగ్గుల పోటీలు శనివారం రోజున ఉత్సాహంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి గ్రామపంచాయతీ సర్పంచ్ చింతపూల నరేందర్, ఉప సర్పంచ్ చింతపూల అనిల్, వార్డు సభ్యులు హాజరైనారు. గ్రామంలోని మహిళలు రంగురంగుల ముగ్గులతో తమ ప్రతిభను చాటుకున్నారు. మహిళలలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడం, సంప్రదాయ కళలకు ప్రోత్సాహం అందించడమే ఈ కార్యక్రమం లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇందుర్తి ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం జయప్రద, జర్నలిస్టు రఘునాథ్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు. పోటీల నిర్వహణకు సహకరించిన వారందరికీ గ్రామ పంచాయతీ పాలకవర్గం కృతజ్ఞతలు తెలిపింది.



## కామాంధుడి దారుణం కుటుంబ సన్నిహితుడే చిన్నారి పై దాడి

**దమ్మపేట జనవరి 03(ప్రజాస్వరం):**

ఏడో తరగతి చదువుతున్న చిన్నారి పై ఆ కుటుంబానికి సన్నిహితుడైన వ్యక్తి దారుణమైన లైంగిక వేధింపులు చేసిన ఘటన దమ్మపేటలో కలకలం రేపింది. బాలిక పాఠశాలలో ఉండగా నిందితుడు దారుణ చర్యలు ప్రారంభించినట్టు సమాచారం. చిన్నారి తల్లి వెంటనే ఫిర్యాదు చేయడంతో, ఎస్సై సాయి కిషోర్ రెడ్డి నేతృత్వంలో దర్యాప్తు ప్రారంభమైంది. నిందితుడిపై కఠినమైన POCSO చట్టం ప్రకారం కేసు నమోదు చేసి, పూర్తి దర్యాప్తు జరుగుతోందని పోలీసులు తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం, నిందితుడు చిన్నారి భద్రతను మరిచిపోయి అత్యంత దారుణమైన చర్యలు చేశాడు. ప్రతి సమాచారం జాగ్రత్తగా సేకరించి, కేసు పూర్తి రికార్డింగ్ తో పాటు న్యాయ ప్రక్రియకు సిద్ధం చేస్తున్నారు. పోలీసుల సూచన చిన్నారులపై ఏవైనా అఘాయిత్యాలు జరిగినప్పుడల్లా



కఠినమైన శిక్ష తప్పవని, స్థానికులు చిన్నారుల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టి, సమస్యలు ఎదురైతే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను హెచ్చరించారు. చిన్నారిని మానసిక, భౌతిక సహాయాలతో పాటు సమీప సామాజిక సంక్షేమ కేంద్రాలు, సైకాలజిస్టులు సహాయంగా పరిష్కరించనున్నట్టు అధికారులు చెప్పారు.





# అక్షరాల వెలుగుతో సమాజాన్ని మార్చిన సావిత్రిబాయి పూలే

- **రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ చైర్మన్ మధుసూదనరెడ్డి**

**షాబాద్, జనవరి 03(ప్రజాస్వరం)**

భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు, మహిళా విద్యకు మార్గదర్శకురాలైన మహనీయురాలు సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా షాబాద్ ఎంపీడీఓ కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదనరెడ్డి రెడ్డి గారు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మధుసూదనరెడ్డి రెడ్డి మాట్లాడుతూ మహిళల విద్య కోసం సావిత్రిబాయి పూలే చేసిన త్యాగం, విద్యనే ఆయుధంగా చేసుకుని సమానత్వం కోసం సాగించిన పోరాటం దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని అన్నారు. మహిళలకు చదువు హక్కు లేదనే కాలంలోనే విద్య ద్వారా సమాజాన్ని మార్చవచ్చని నిరూపించిన మహనీయురాలిగా ఆమె జీవితం నేటి తరాలకు మార్గదర్శకమని పేర్కొన్నారు. అదేవిధంగా సావిత్రిబాయి పూలే గారి ఆశయాలను కొనసాగిస్తూ జ్ఞాన దీపాలను వెలిగిస్తూ, విలువల బాటలో విద్యార్థులను నడిపిస్తున్న ప్రతి మహిళా ఉపాధ్యాయురాలికి ఈ సందర్భంగా 'మహిళా ఉపాధ్యాయ దినోత్సవం' శుభాకాంక్షలు తెలియజేశారు. మహిళా ఉపాధ్యాయుల సేవలు సమాజ నిర్మాణంలో అత్యంత కీలకమని, వారి కృషిని ప్రతి ఒక్కరూ గౌరవించాలని ఆయన పిలుపునిచ్చారు.



## ప్రముఖ కొల్లాబెరా కు 24 మంది యస్.బి.ఐ.టి. విద్యార్థుల ఎంపిక

**ఖమ్మం జనవరి 03(ప్రజాస్వరం):**

ప్రముఖ గ్లోబల్ టెక్నాలజీ కన్సల్టింగ్ , డిజిటల్ ఇంజనీరింగ్ సంస్థ కొల్లాబెరా కంపెనీ కి తమ కళాశాలకు చెందిన 24 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. శనివారం కళాశాల ఆవరణలో జరిగిన కంపెనీ ప్రాంగణ నియామకాలలో ఆయన మాట్లాడుతూ విప్లవాత్మక మార్పులు జరుగుతున్న ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ రంగంలో పెరుగుతున్న డిజిటల్ సేవల దృష్ట్యా రానున్న రోజులలో మరింత ఆదరణ ఉంటుందని అని అన్నారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన అమెజాన్, హెచ్.సి.ఎల్ వంటి కంపెనీలకు క్లయింట్స్ గా కలిగిఉండటమే కాకుండా ఫార్చ్యూన్ 100 కంపెనీలలో 59 శాతం సంస్థలకు డిజిటల్ సేవలు అందించటంలో ఈ కంపెనీ భాగస్వామిగా ఉందని తెలిపారు. డేటా ఇంజనీరింగ్, క్లౌడ్ ఇంజనీరింగ్ వంటి ఆధునిక రంగాలలో డిజిటల్ సొల్యూషన్స్ అందిస్తున్న ప్రముఖ ఇంజనీరింగ్ సంస్థ కొల్లాబెరాకు తమ విద్యార్థులు ఎంపిక అవ్వడం హర్షించదగ్గ విషయం అని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా. జి. ధాత్రి తెలిపారు. ఈ సంస్థలో ఎంపికైన విద్యార్థులకు బిగ్ డేటా, క్లౌడ్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ మొదలగు సాంకేతికతలలో శిక్షణ అందిస్తారని తెలిపారు. తమ విద్యార్థులకు నిరంతరంగా ప్రణాళికా బద్ధంగా అందిస్తున్న క్యాంపస్ రిక్రూట్మెంట్ ట్రైనింగ్ ద్వారా నే ఈ సత్ఫలితాలు సాధించగలిగామని కళాశాల వైస్ ఛైర్మన్ కె. శ్రీచైతన్య వెల్లడించారు. ఈ ఉద్యోగాలకు జరిగిన ప్రాంగణ నియామకాలలో 140 మంది సి.యస్.ఈ.,ఈ.సి.ఈ. విద్యార్థులు పాల్గొనగా 70 మంది విద్యార్థులు రాత పరీక్షలలో ఎంపికై తదుపరి మౌఖిక పరీక్షకు అర్హత సాధించారని, తుది పరీక్షలో 24 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక అయినట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ఇతర నదుపాలతో పాటు వార్షిక ఆదాయంగా 3 లక్షలు అందుకుంటారని కళాశాల ప్రిన్సిపల్ డా రాజ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం ఎంపికలు నిర్వహించిన కొల్లాబెరా డిజిటల్ హెచ్ఆర్ ఎగ్జిక్యూటివ్ ధృవ్ ను కళాశాల యాజమాన్యం సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, డా ఎ.వి.వి. శివ ప్రసాద్, టి.పి.ఒ. యన్. సవిత, కోఆర్డినేటర్ డా జి. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## మండల తెదేపా జనరల్ సెక్రెటరీ బుస్సా జనార్ధన్ గౌడ్ చే 10టీవీ నూతన క్యాలెండర్ ను ఆవిష్కరించిన టేకుమంద మణి

**చిత్తూరు జిల్లా/ బంగారుపాళ్యం జనవరి 03(ప్రజాస్వరం):**

చిత్తూరు జిల్లా బంగారుపాలెం మండల తెలుగుదేశం పార్టీ జనరల్ సెక్రెటరీ బుస్సా జనార్ధన్ గౌడ్ టెన్ టీవీ 2026వ సంవత్సరం నూతన క్యాలెండర్ ను శనివారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. పూతలపట్టు నియోజవర్గం 10 టీవీ రిపోర్టర్ వి.గోపి వీరికి అందజేశారు. కార్యక్రమంలో మండల తెలుగు దేశం పార్టీ సోషల్ మీడియా అధ్యక్షులు మణి టేకుమంద సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులచే 10 టీవీ క్యాలెండర్ ను ఆవిష్కరించడం తనకెంతో ఆనందంగా ఉందని టేకుమంద మణి తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జనరల్ సెక్రెటరీ జనార్ధన్ గౌడ్, మండల సోషల్ మీడియా అధ్యక్షులు మణి, గ్రామస్తులు మల్లయ్య, పరదేశి, చంగల్ రాయులు, కుమార్ రాజా, జిల్లా ఎస్సీ సెల్ నాయకులు పెరుమాళ్ళపల్లి రవి తదితరులు పాల్గొన్నారు.



## కొండగట్టు అభివృద్ధి కార్యక్రమలకు భూమి పూజ ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

**జగిత్యాల, జనవరి 03(ప్రజాస్వరం):**

ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామిని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా విచ్చేసిన ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు కొండగట్టు అభివృద్ధికి రూ.35.19 కోట్ల టీటీడీ నిధులతో వసతి గదులు, ధర్మశాల, మాల విరమణ మండపానికి భూమి పూజ చేశాడు ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ తో పాటు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్,ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ఉన్నత అధికారులు పలువురు నేతలు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర అసహనం

- **పవర్ పాయింట్ ప్రజెంటేషన్ సమయంలో లాబీల్లో తిరిగిన ఎమ్మెల్యేలు**
- **కీలక అంశంపై ప్రజెంటేషన్ ఇస్తుంటే ఇలా వ్యవహరించడం సరైనది కాదన్న సీఎం**
- **అధికార పార్టీ ఎమ్మెల్యేలు తప్పనిసరిగా సభలో ఉండాలన్న ముఖ్యమంత్రి**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసనసభ్యుల పట్ల సీరియస్ అయ్యారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తున్న సమయంలో కొందరు కాంగ్రెస్ ఎమ్మెల్యేల ప్రవర్తనపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. అసెంబ్లీలో 'నీళ్లునిజాలు'పై స్వల్పకాలిక చర్చ సందర్భంగా ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సమయంలో కొందరు ఎమ్మెల్యేలు సభలో ఉండకుండా లాబీల్లో తిరిగారు.

ప్రభుత్వం ఒక కీలక అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరిస్తుంటే ఎమ్మెల్యేలు సభలో లేకపోవడం సరైన పద్ధతి కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఇలా వ్యవహరిస్తే ప్రభుత్వ ప్రతిష్ఠ దెబ్బతింటుందని అన్నారు. ప్రజలు సమావేశాలను గమనిస్తుంటారని, కాబట్టి ఎమ్మెల్యేలు అత్యంత బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. ఎమ్మెల్యేలు సభలో లేకపోవడం పార్టీ క్రమశిక్షణకు విరుద్ధమని ఆయన అన్నారు.

ప్రభుత్వ విధానాలు, కార్యక్రమాలపై చర్చ



జరుగుతున్నప్పుడు అధికార పార్టీ ఎమ్మెల్యేలు తప్పనిసరిగా సభలో ఉండాలని సూచించారు. ఎమ్మెల్యేలందరినీ సభలోకి పిలిపించాలని కాంగ్రెస్ విప్‌లను ఆదేశించారు. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చూసుకోవాలని హితవు పలికారు.

## ఆరోగ్య మేళాలో సర్పంచ్ కు సన్మానం


**వలిగొండ జనవరి 03(ప్రజాస్వరం):**

వలిగొండ మండలంలోని పులిగిల్ల గ్రామంలో నిర్వహించిన ఆరోగ్య మేళాలో గ్రామ సర్పంచ్ పల్లెర్ల అనూష మల్లేష్ను వైద్య సిబ్బంది శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ సైదులు, పాశం స్వామి, ఎంఎలౌచ్పి బాలజ్యోతి, ఏఎన్ఎం స్వరూప, ఆశ కార్యకర్త సుజాత తదితరులు పాల్గొన్నారు.



# అక్రమ బెల్ట్ షాపులపై కఠిన చర్యలు

- **16 లీటర్ల మద్యం స్వాధీనం – కేసులు నమోదు**
- **రాయపోల్ ఎస్ఐ కుంచం మానస హెచ్చరిక**



**దౌల్తాబాద్ జనవరి 3( ప్రజాస్వరం ) :**

గ్రామాలలో అక్రమంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తూ మద్యం విక్రయిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని రాయపోల్ ఎస్ఐ కుంచం మానస హెచ్చరించారు. శనివారం రాయపోల్ మండలంలోని ఆరేపల్లి, వడ్డేపల్లి, రామారం గ్రామాలలో పోలీస్ సిబ్బందితో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గ్రామాలలో అక్రమంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తూ మద్యం విక్రయిస్తున్నారని నమ్మదగిన సమాచారం మేరకు ఈ తనిఖీలు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు. తనిఖీల్లో ఆరేపల్లి గ్రామానికి చెందిన దుర్గం గౌరేశ్, వడ్డేపల్లి గ్రామానికి చెందిన నర్సాగౌడ్, ఆంజనేయులు, రామారం గ్రామానికి చెందిన లక్ష్మి తమ హోటళ్లలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. వారి వద్ద నుంచి సుమారు 16 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. భవిష్యత్తులో ఎవరైనా బెల్ట్ షాపులు నిర్వహిస్తూ అక్రమంగా మద్యం విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్ఐ కుంచం మానస స్పష్టం చేశారు.



# ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

- **ఆటో డ్రైవర్ యూనియన్ అధ్యక్షుడు మహమ్మద్ అక్బర్ డిమాండ్**

**దౌల్తాబాద్ జనవరి 3( ప్రజాస్వరం ) :**

రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీ ప్రకారం సంవత్సరానికి రూ.12 వేల ఆర్థిక సాయం అందించి వారి కుటుంబాలను ఆదుకోవాలని ఆటో డ్రైవర్ యూనియన్ అధ్యక్షుడు మహమ్మద్ అక్బర్ డిమాండ్ చేశారు. శనివారం ఆటో డ్రైవర్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమానికి పిలుపునివ్వగా, రాయపోల్ మండలంలోని ఆటో డ్రైవర్లను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా అక్బర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో ఆటో డ్రైవర్లు తీవ్ర ఉపాధి సమస్యను ఎదుర్కొంటున్నారని అన్నారు. రోజువారీ ఆదాయం లేక కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటోలు కొనుగోలు చేసేందుకు ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థల్లో అప్పులు చేసి కొనుగోలు చేశామని, ప్రస్తుతం నెల నెల ఫైనాన్స్ వాయిదాలు చెల్లించడం భారంగా మారిందని తెలిపారు. గతంలో ఆటో డ్రైవర్ల సమస్యలపై ఆందోళనలు చేపట్టిన సమయంలో నెలకు రూ.1,000 చొప్పున సంవత్సరానికి రూ.12 వేలు చెల్లించి ఆదుకుంటామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. అయితే అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా ఇప్పటివరకు ఆ హామీ అమలు కాలేదని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆటోలకు రోడ్డు ట్యాక్స్‌ను రద్దు చేసి, బీమా సౌకర్యం కల్పించిందని పేర్కొన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.



# ఉజ్వల పథకం ఉచిత గ్యాస్ కనెక్షన్ల పంపిణీ

**మాసాయిపేట జనవరి 04 (ప్రజాస్వరం)**

మండలం లోని నడిమితండాలో 'ఉజ్వల' పథకం కింద 9 మంది లబ్ధిదారులకు సర్పంచ్ కేతావత్ రాములు నాయక్ శనివారం ఉచిత గ్యాస్ కనెక్షన్లను పంపిణీ చేశారు. నూతన రేషన్ కార్డు కలిగిన మహిళలకు తూప్రాన్ ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంజూరయ్యాయి. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ స్వాతి శ్రీనివాస్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.






# నిర్దేశించిన లక్ష్యం మేరకు ఓటర్ల మ్యాపింగ్ పూర్తి చేస్తాం

- **జిల్లా ఇంచార్జి అదనపు కలెక్టర్ రాజేశ్వరి**

**వికారాబాద్, జనవరి 3(ప్రజా స్వరం):**

ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను నిర్దేశించిన లక్ష్యం మేరకు పూర్తి చేస్తామని జిల్లా ఇంచార్జి అదనపు కలెక్టర్ రాజేశ్వరి తెలిపారు. శనివారం ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియపై, లక్ష్యం మేరకు మ్యాపింగ్ పూర్తి చేసే విధంగా జిల్లా కలెక్టర్ లు, ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ఎన్నిక అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులకు విధివిధానాలను సూచించారు. రాబోవు 12 రోజుల్లోగా నిర్దేశించిన లక్ష్యం మేరకు ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేసి పూర్తిచేయాలని సూచించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారులు 30 వేల నుండి 40 వేలు, సహాయ ఎన్నికల అధికారులు 3 వేల నుండి 4 వేలు, బి ఎల్ ఓ సూపర్వైజర్లు 300 నుండి 400 లు, బిఎల్ఓ లు 30 నుండి 40 వరకు ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను చేపట్టాలని ఆయన తెలిపారు. బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటిని సందర్శించి మ్యాపింగ్ చేసే విధంగా చూడాలని అధికారులకు తెలిపారు. బూత్ స్థాయి అధికారులకు గుర్తింపు కార్డులు కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా వికారాబాద్ జిల్లాలో రోజువారీగా నిర్దేశించిన లక్ష్యం మేరకు 16264 ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ ను చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా ఇంచార్జి అదనపు కలెక్టర్ రాజేశ్వరి తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 52.65 శాతం మ్యాపింగ్ చేపట్టడం జరిగిందని, నిర్దేశించిన సమయం లోగా 75 శాతం ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను చేపట్టి పూర్తి చేస్తామని ఆమె తెలిపారు. వివిధ ఎన్నికల బాధ్యతల్లో ఉన్న అధికారులకు నిర్దేశించిన లక్ష్యాల మేరకు ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేస్తామని ఆమె తెలిపారు. కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా రెవెన్యూ అధికారి మంగి లాల్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నైమత్ అలీ, వికారాబాద్ తహసిల్దార్ లక్ష్మి నారాయణ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# ఘనంగా సావిత్రిబాయి పూలే 195వ జయంతి

**రామాయంపేట 3.( ప్రజాస్వరం )**

రామయంపేటలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా టిపిసిసి కార్యదర్శి చౌదరి సుప్రభాత రావు, సావిత్రిబాయి పూలే సంఘం రాష్ట్ర కార్యదర్శి అశ్విని శ్రీనివాస్, అలాగే రమేష్ రెడ్డి , గజవాడ నాగరాజు లు మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే విద్యావేత్త , మహిళల హక్కులను గుర్తించిన సంఘ సంస్కర్త అని అన్నారు. సావిత్రిబాయి పూలే తన భర్త జ్యోతిరావు పూలే సహకారంతో చదువుకొని మహిళలకు మద్దతుగా సామాజిక న్యాయం జరగాలంటూ కుల మతాలకు అతీతంగా అందరూ సమాజంలో రాణించాలని నిరంతరం పోరాటం చేసిందని అన్నారు . అణగారిన వర్గాల బాలికల కోసం అనేక పాఠశా పాఠశాలలను నెలకొల్పిన గొప్ప మహనీయురాలని అన్నారు. అలాగే ఇక్కడి ప్రాంతంలో మహనీయుల విగ్రహాల ను నెలకొల్పి ఈ మహనీయుల చేసిన గొప్ప పనులను ఇక్కడి ప్రాంత ప్రజలకు తెలియజేసిన అశ్విని శ్రీనివాస్లకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు దెమె యాదగిరి, సుందర్ సింగ్, విప్లవ కుమార్, దండు శివ, చింతల స్వామి, అబ్రమైన గంగారం , పాతూరి రాజు , సుంకోజు దామోదర్, ఎనిశెట్టి అశోక్ , దాకి స్వామి, దేవుని సర్వయ్య, గణేష్ , శంకర్ గౌడ్, తొనిగండ్ల శంకర్, శశికాంత్, పిట్ల శ్రీశైలం, మట్టి యాదగిరి, భూమా సిద్ధరాములు, తదితరులు పెద్ద ఎత్తున బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యే రోహిత్ రావు కలిసిన మాజీ కౌన్సిలర్ బెజవాడ నాగరాజు

**రామాయంపేట. 03.( ప్రజాస్వరం )**

మెదక్ జిల్లా రామాయంపేట మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ గజవాడ నాగరాజు శనివారం మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు ను మర్యాదపూర్వకంగా కలిశారు. మెదక్ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేని కలిసిన నాగరాజు నూతన సంవత్సరం సందర్భంగా పుష్ప గుచ్చాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. రామాయంపేట మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే రోహిత్ రావు దృష్టికి తీసుకెళ్లారు. మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యకర్తలంతా కలిసికట్టుగా పనిచేసే రామాయంపేట మున్సిపల్ చైర్మన్ పదవిని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవాలని సూచించినట్లు తెలిపారు

# పటాన్ చెరు వేదికగా జాతీయ స్థాయి బాడీ బిల్డింగ్ ఛాంపియన్షిప్

- **ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**పటాన్ చెరు, జనవరి 03(ప్రజా స్వరం)**

పటాన్చెరు పట్టణంలోని మైత్రి మైదానం వేదికగా ఆదివారం సాయంత్రం ఐదు గంటలకు జీఎంఆర్ ఆల్ ఇండియా బాడీ బిల్డింగ్ ఛాంపియన్షిప్ పోటీల నిర్వహణకు సర్వం సిద్ధం చేసినట్లు పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నేటి తరం యువతను క్రీడల వైపు ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఈ జాతీయ స్థాయి పోటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరిలో వ్యాయామంపై ఆసక్తి పెంపొందించేలా ఈ కార్యక్రమాన్ని రూపకల్పన చేసినట్లు పేర్కొన్నారు. యువత పెడదారి పట్టకుండా క్రీడలపై దృష్టి సారించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పటాన్చెరు నియోజకవర్గంలో తొలిసారిగా జాతీయ స్థాయి బాడీ బిల్డింగ్ ఛాంపియన్షిప్ పోటీలు నిర్వహించబడుతున్నాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంతో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొననున్నారని వెల్లడించారు. క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నామని, ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.




# సమస్యలపై స్థానికులతో చర్చించిన ఐలాపూర్ మాణిక్ యాదవ్

**అమీన్‌పూర్, జనవరి 03(ప్రజా స్వరం)**

అమీన్‌పూర్ మునిసిపాలిటీ పరిధిలోని నరేంద్ర నగర్ కాలనీలో ఈ రోజు ఐలాపూర్ మాణిక్ యాదవ్ పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో నివసిస్తున్న ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై స్థానికులతో ప్రత్యక్షంగా చర్చించి వివరాలు తెలుసుకున్నారు. ప్రధానంగా తాగునీటి కొరత, డ్రైనేజ్ సమస్యలు, రోడ్ల దుస్థితి, వీధి దీపాల లేమి, పారిశుధ్య లోపాలు వంటి మౌలిక వసతుల అంశాలపై ప్రజలు వ్యక్తం చేసిన అభిప్రాయాలను ఆయన శ్రద్ధగా విన్నారు. ఈ సందర్భంగా ఐలాపూర్ మాణిక్ యాదవ్ మాట్లాడుతూ, కాలనీలో ఉన్న ప్రతి సమస్యను సంబంధిత మునిసిపల్ అధికారులు మరియు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి, దశలవారీగా పరిష్కరించేలా కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. నరేంద్ర నగర్ కాలనీ అభివృద్ధికి తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని, ప్రజలతో కలిసి పనిచేస్తూ సమస్యలకు శాశ్వత పరిష్కారాలు తీసుకువస్తామని ఆయన హామీ ఇచ్చారు.



# అండర్14 తెలంగాణ కబడ్డీ జట్టుకు ట్రాక్ సూట్ల పంపిణీ: ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**పటాన్ చెరు, జనవరి 03(ప్రజా స్వరం)**

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దుర్గ్ కేంద్రంగా జనవరి 6 నుంచి ప్రారంభం కానున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జాతీయ స్థాయి క్రీడలకు వెళ్తున్న అండర్ 14 తెలంగాణ కబడ్డీ జట్టుకు పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి సొంత నిధులతో ట్రాక్ సూట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ స్థాయి నుంచి క్రీడలపై ఆసక్తి పెంపొందించేలా నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. క్రీడాకారులకు అవసరమైన ప్రోత్సాహం అందించడం ద్వారా వారు రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ చూపేలా సహకరిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, మైత్రి క్రికెట్ క్లబ్ అధ్యక్షుడు హనుమంత్ రెడ్డి, సీఐలు వినాయక్ రెడ్డి, రవీందర్ రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు



**చేగుంట జనవరి 03 (ప్రజా స్వరం)**

చేగుంట మండలంలోని రెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో సావిత్రిబాయి పూలె జయంతి ని పురస్కరించుకొని ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను శాలువలతో ఘనంగా సన్మానించడం జరిగింది. అనంతరం తపస్ రాష్ట్ర ప్రధాన కార్య దర్శి నవాత్ సురేష్ మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే 195 జయంతి సందర్భంగా భారతీయ సంఘ సంస్కర్తగా, మొదటి ఉపాధ్యాయినిగా అనేక సేవలు అందించిందని,ఆమె తన భర్తతో కలసి 1848 జనవరి 1న పూణేలో మొట్టమొదటగా బాలికల పాఠశాలను ప్రారంభించడం జరిగిందని ఆమెను కొనియాడారు. ఆమెను ఆదర్శంగా తీసుకొని నేటి మహిళలందరూ కూడా ఉన్నత స్థాయిలో ఉండాలని వారన్నారు. ఈ కార్యక్రమంలో చల్లా లక్ష్మణ్, చల్లా రామకృష్ణ, సుమతి, రజిని, సుమలత, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

# గురుకుల పాఠశాలలో సావిత్రిబాయి జయంతి

**రామాయపేట.03.(ప్రజాస్వరం ) :**

మెదక్ జిల్లా రామాయపేట మండల కేంద్రం లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో శనివారం మహాత్మా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సావిత్రి బాయి పూలే 125వ జయంతి పురస్కరించు కొని పాఠశాల సిబ్బంది సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా ని వాళులర్పించారు. నిరుపేద మహిళలకు విద్య అందించిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని అన్నారు. ఆమె చూపిన మార్గంలో ప్రతి ఒక్కరు నడవాలని పిలుపునిచ్చారు



# రోడ్డు ఏర్పాటు

**మాసాయిపేట జనవరి 04 ( ప్రజాస్వరం) :**

మండలం లోని హకీంపేటకు నూతనంగా బీటీ రోడ్డు ఏర్పాటు చేశారు. మా సాయిపేట మండల కేంద్రం నుంచి అచ్చంపేటకు వెళ్లే ప్రధాన రహదారి నుంచి హకీంపేటకు నూతనంగా రోడ్డు మంజూరైంది. రెండు రోజుల క్రితం నూతనంగా బీటీ రోడ్డును హకీంపేటకు వేశారు. నూతనంగా రోడ్డు వేయడంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఇంతకాలం రోడ్డు సక్రమంగా లేక చాలా ఇబ్బందులు పడ్డట్లు పేర్కొన్నారు.



# అక్షర జ్యోతి సావిత్రి భాయి పూలే




**దౌల్తాబాద్/ కరీంనగర్ జనవరి03(ప్రజాస్వరం)**

మహిళలు అంగన్వాడీ నుంచి అంతరిక్షం వరకు ఎదగడానికి అహర్నిశలు కృషి చేసిన అక్షర జ్యోతి సావిత్రి భాయి పూలే అని మైనారిటీ గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కనపర్తి సురేష్ అన్నారు. ఇరుకుల్ల బాలుర మైనారిటీ గురుకుల పాఠశాల-2లో సావిత్రి భాయి పూలే జయంతి కార్యక్ర మాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సం దర్భంగా డాక్టర్ సురేష్ మాట్లాడుతూ, మహిళా విద్య కోసం తొలి అడుగులు వేసిన తొలి మహిళా ఉపాధ్యాయురా లిగా సావిత్రి భాయి పూలే చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. ఎన్నో అవమానాలు, అడ్డంకులను ఎదు ర్కొని బాలికల విద్య కోసం పోరాడిన మహనీయురాలిగా ఆమె సేవలు సమా జానికి ఆదర్శమన్నారు. విద్య ద్వారా సమాజంలో సమానత్వం సాధ్యమని ఆమె నిరూపించిందని తెలిపారు. కార్య క్రమంలో అధ్యాపకులు నగేష్, రాజు, అశోక్ మాట్లాడుతూ సావిత్రి భాయి పూలే జీవితం, ఆమె చేసిన సామాజిక సంస్కరణలు నేటి విద్యార్థులకు మా ర్గదర్శకమని పేర్కొన్నారు. విద్యను ఆయుధంగా చేసుకుని ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహేందర్, జలజ, జ్యోతి, ఫైజా, శ్రీలత, జూవేరియా, సురేష్, శ్రవణ్, పవన్, శ్రీనివాస్, విష్ణు, శ్రీధర్, రాజు, వార్డెన్ పకృద్దీన్ తదితరులు పాల్గొని సావిత్రి భాయి పూలే చిత్రపటానికి పూ లమాలలు వేసి ఘన నివాళులు అర్పిం చారు. కార్యక్రమం చివర్లో విద్యార్థులు ఆమె ఆశయాలను ఆచరణలో పెట్టాలని ప్రతిజ్ఞ చేశారు.

# ఇళ్ల మధ్య చెత్తాచెదారం



**మాసాయిపేట, జనవరి 03 (ప్రజా స్వరం) :**

గ్రామంలో ఇళ్లకు సమీపంలో చెత్తాచెదారం పే రుకుపోయి పందులు స్వైర విహారం చేస్తున్నట్లు ప్రజలు ఆరోపించారు. చెత్తను విచ్చలవిడిగా వేయడంతో పందులు అక్కడే నివాసముంటు న్నట్లు పేర్కొన్నారు. చెత్తాచెదారం, పందుల కారణంగా దోమలు పెరిగిపోయాయని ప్రజలు తెలిపారు. గ్రామ పంచాయతీ అధికా రులు స్పందించి చెత్తను తొలగించి, పందులు రాకుండా చూడాలని కోరారు.

# నట్టల నివారణ మందు పంపిణీ



- **సర్పంచ్ మెగావత్ బన్సీలాల్**

**రామయంపేట. 03.(ప్రజాస్వరం) :**

మెదక్ జిల్లా రామయంపేట మండలం జిమ్లా తండా గ్రామపంచాయతీలో నట్టల నివారణ మందు ద్వారా మేకలు, గొర్రెలు ఆరోగ్యంగా ఉంటాయని వెటర్నరీ డాక్టర్ సురేశ్ అన్నారు. రామాయంపేట మండలం జముల తండా గ్రామ పంచాయతీ పరిధిలో శనివారం నట్టల నివారణ మందు పంపిణీ కార్య క్రమాన్ని గ్రామ సర్పంచ్ మెగావత్ బన్సీ లాల్ ప్రారంభించారు. ప్రభుత్వం ఉచితంగా నట్టల నివారణ మందు పంపిణీ చేస్తున్నం దున మేకలు, గొర్రెల కాపర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తాండ నాయకులు తదిత రులు పాల్గొన్నారు.

# ఘనంగా సావిత్రిబాయి జయంతి



**చేగుంట జనవరి 3 (ప్రజా స్వరం) :**

చేగుంట మండలంలోని రెడ్డి పల్లి ప్రాథమిక పాఠశాల లో సావిత్రిబాయి పూలె జయంతి ని పురస్కరించుకొని ఆమె చిత్రపటానికి పూలమా లేసి, పాఠశాలలో పనిచేస్తున్న మహిళా ఉపాధ్యా యులను సన్మానించారు, ఈ సందర్భంగా తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్ మాట్లాడు తూ సావిత్రిబాయి పూలే 195 జయంతి సంద ర్భంగా భారతీయ సంఘ సంస్కర్తగా, మొదటి ఉపాధ్యాయినిగా అనేక సేవలు అందించింద ని,ఆమె తన భర్తతో కలసి 1848 జనవరి 1న పూణేలో మొట్టమొదటగా బాలికల పాఠశాలను ప్రారంభించింది అని వారు అన్నారు. ఆమెను ఆదర్శంగా తీసుకొని నేటి మహిళలందరూ కూడా ఉన్నత స్థాయిలో ఉండాలని వారన్నారు. ఈ కార్యక్రమంలో చల్లా లక్ష్మణ్, చల్లా రామకృష్ణ, సుమతి, రజిని, సుమలత, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యం



**మాసాయిపేట జనవరి 04 (ప్రజాస్వరం) :**

రామంతపూర్ గ్రామ నూతన సర్పంచ్ భవాని సౌందర్య రఘుపతి అన్నారు. 547 ఓట్ల మెజార్టీ తో గెలిపించిన మా గ్రామ ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని ఆయన స్పష్టం చేశారు. నన్ను ఆదరించి ఆశీర్వదించి గెలిపించిన మా గ్రామ ప్రజలకు నాయకులకు కార్యకర్తలకు శ్రే యోభిలాషులకు బంధుమిత్రులకు ప్రత్యేక ధన్య వాదాలు తెలిపారు. గ్రామంలో అర్హులైన లబ్ధి దారులకు రేషన్ కార్డులు పింఛన్లు ఇందిరమ్మ ఇండ్లు ఇప్పించేందుకు నా శాయశక్తుల కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు. గ్రామంలో పరిష్కరించాల్సిన సమస్యలను ముందుగా పరి ష్కరిస్తానని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. గ్రామంలోని సమస్యలను గుర్తించి పరిష్కరిం చేందుకు కృషి చేస్తానని ఆయన వెల్లడించారు.

# ప్రపంచ తెలుగు మహాసభలకు దేవులపల్లి రమేశ్‌కు ఆహ్వానం

**నంగునూర్, జనవరి 03 ప్రజా స్వరం :**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం,గుంటూరులో జరిగే 3వ ప్రపంచ తెలుగు మహాసభలకు గాను, సిద్ధిపేట జిల్లా, నంగునూర్ మండల కేంద్రానికి చెందిన రచయిత, కవి బీసీ గురుకుల,ఎంజేపీ తెలుగు అతిథి ఉపాధ్యాయులు దేవులపల్లి రమేశ్, ఆహ్వానం అందుకున్నారు.ఆంధ్ర సారస్వత పరి షత్తు,ఆధ్వర్యంలో 3వ ప్రపంచ తెలుగు మహా సభలు, ఈనెల 3వ తేది నుండి 5వ తేదీలలో జరిగే ప్రపంచ తెలుగు మహాసభల సదస్సులో పాల్గొనవలసిందిగా ఆంధ్ర సారస్వత పరిషత్తు, అధ్యక్షులు డా. గజల్ శ్రీనివాస్,తెలుగు మహాస భల సమన్వయకర్త, పి. రామచంద్ర రాజు, కొల్లి రమావతి, ఆహ్వానం పంపారు.3వ ప్రపంచ తెలుగు మహా సభలకు అవకాశం రావడం చాలా సంతోషకరమని, తెలుగు భాష గొప్పత నం, గురించి కవితా గానం చేస్తున్నట్లు, కవి దేవులపల్లి రమేశ్ పేర్కొన్నారు. తెలుగు భాష



అభివృద్ధి కొరకు కృషి చేస్తానని మన తెలుగు భాషను కాపాడుకోవాల్సిన అవసరం తెలుగు వారి పైన ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నా యుడు,వివిధ రాష్ట్రాల మంత్రులు, వివిధ దేశాల కవులు కళాకారులు పాల్గొంటారని తెలిపారు.

# తూప్రాన్ ఎస్సై శివనందం బదిలీ




- **సన్మానించిన సీఐ రంగ కృష్ణ**

**తూప్రాన్ జనవరి3 ( ప్రజాస్వరం) :**

తూప్రాన్ పోలీసుసబ్ ఇన్స్పెక్టర్ శివనందం బధిలి కావడంతో తూప్రాన్ సిఐ రంగ కృష్ణ శాలవతో సన్మానించారు గత మూడేళ్ళుగా తూప్రాన్ కు సే వాలందించారని ఇప్పుడు మెదక్ స్పెషల్ బ్రాంచ్ కు బదిలీ పై వెళ్లారు అప్పటివరకు తూప్రాన్ సబ్ ఇన్స్పెక్టర్ గా జ్యోతి ఉంటారని సిఐ రంగ కృష్ణ తెలిపారు ఎసై శివనందం మాట్లాడుతూ నాకు సహకరించిన మండల ప్రజలకు అధికారులకు మీడియా ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు

# అంగన్‌వాడీని పరిశీలించిన సర్పంచ్ జయభారతి

**గజ్వేల్ / వర్గల్ జనవరి 03 ప్రజాస్వరం :**

మండల కేంద్రంలోని అంగన్వాడి 4 సెంటర్ ను సర్పంచ్ దేవగనిక జయభారతి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని, అంగన్వాడి సెంటర్లలో బాలిం తలకు కావలసిన పాలు, గుడ్లు, బాలామృతం, పోషకహారాలు కలిగినటువంటి వారికి రోగ నిరోధక శక్తిని అందించే డైట్ ను తప్పక అందించి, సుఖ ప్రాసవాలు అయ్యే విధంగా ఆహార పదార్థాలు అంగన్వాడి సెంటర్లు అందిం చాలని, దాంతోపాటు చిన్న పిల్లలకు కూడా సరై నటువంటి ఇమ్యూనిటీ అందించే పోషకాఆహార పదార్థాలను అందిస్తూ వారికి చదువును కూడా అందించడం హర్షనీయమని పేర్కొన్నారు. ఈ విధంగా అంగన్వాడి సెంటర్లు బాధ్యతతో పని చేయాలని సర్పంచ్ పేర్కొన్నారు. అనంతరం అంగన్వాడి టీచర్ దుర్గా సర్పంచ్ కి శాలువాతో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు వేలూరి కిష్టారెడ్డి,దేవగనిక నాగరాజు, వార్డ్ సభ్యులు మోసిన్, పర్శరాములు మరియు ఆయా, మహిళలు పాల్గొన్నారు



# గ్రామాలను అభివృద్ధి చేసి ఉత్తమ అవార్డులు సాధించాలి

**తూప్రాన్, ప్రజా స్వరం :**



మెదక్ జిల్లా రామయంపేట్. నిజాంపేట్ మండలాల నూతన ఎస్సీ ఎస్టీ సర్పంచ్ లకు రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కివెంకటయ్య సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలను అభివృద్ధి చేసి ఉత్తమ అవార్డు లు సాధించి సర్పంచ్ లు ప్రజల మన్ననలను పొందాలని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పిలుపునిచ్చారు. దళిత బహుజన ఫ్రంట్ (డిబిఎఫ్) మెదక్ జిల్లా ఆధ్వర్యంలో చదువుల తల్లి సావిత్రి బాయి పూలే 195 వ జయంతోత్సవం సందర్భంగా శనివారంనాడు రామయంపేట, నిజాంపేట సర్పంచ్ లకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే,చిత్ర పటాం కు కమిషన్ చైర్మన్ పూల మాలలు వేశారు.అనంతరం సర్పంచ్ లను,అధికారులను చైర్మన్ సన్మానించారు. ఈ సందర్ంగా బక్కి వెంకటయ్య మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామి పథకం నిధుల ద్వారా అంగన్ వాడి భవనాలు,పాఠశాలలకు ప్రహరి గొడలు,స్మశాన వాటికలు పల్లెపకృతి వనాల కొసం తీర్మానం చేసి యంపిడిఒ ద్వారా ప్రభుత్వానికి పంపి నిధులు మంజూరు చేసుకొవాలన్నారు.భారత దేశ మొట్టమొదటి మహిళ టిచర్ సావిత్రి బాయి పూలే బాటలో ప్రయాణించి గ్రామాలలో డ్రాపౌట్ లు లేకుండా పిల్లలందరు బడిలో వుండె విధంగాచూడలన్నారు. సర్పంచ్ లకు బాధ్యతలు ఎక్కువ అన్ని ప్రజాప్రతినిధులలో సర్పంచ్ లకే చెక్ పవర్ వుందని అధికారాలను ఉపయోగించుకొని బాధ్యతలను నెరవేర్చాలన్నారు. గ్రామాలలో అసమానతలు లేకుండా సమానత్వ గ్రామాలుగా మార్చాలన్నారు.ఈ కార్యక్రమం లో DSDO సింధు, sho లింగేశ్వర్,SI రాజేష్, DBF మెదక్ జిల్లా అధ్యక్షులు దుబాసి సంజీవ్, మాల మహానాడు రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ సామల అశోక్,BDF మండల అధ్యక్షులు బ్యాగరి చంద్రం, BDFమండల కార్యదర్శి మనుబోతు నరేష్, తదితరులు పాల్గొన్నారు.




# రాయలపూర్ గ్రామసభలో మద్యపాన నిషేధ తీర్మానం

**తూప్రాన్, (ప్రజాస్వరం) :**

రామయంపేట్ మండలంలోని రాయలపూర్ లో నూతన గ్రామపంచాయతీ పాలకవర్గం మొదటి గ్రామసభలో మద్యపానం నిషేధిస్తూ తీర్మానం చేశారు శనివారం రోజు పాటశాల విద్యార్థుల గ్రామ ప్రజలు ర్యాలీ తీశారు మద్యపానం తో పాటు 18 ఏళ్ల లోపు వారికి సిగరెట్లు అమ్మకాలు చేయొద్దని యువకులు గ్రామంలో ద్విచక్ర వాహనాలు స్పీడ్ గా నడిపిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు గ్రామంలో మద్యం విక్రయాలు చేస్తే లక్ష రూపాయల జరిమాన అట్టి డబ్బులు గ్రామ అభివృద్ధి పనులు వాడుతాం అని అమ్మకాలు చేసే వ్యక్తి పేర్లు తెలియజేస్తే 10 వేలు నజరానా ఉంటుందని పాలకవర్గం తెలిపారు

# ఆపరేషన్ స్మైల్–12 పోస్టర్ ఆవిష్కరణ

- **బాలల ముఖాల్లో చిరునవ్వు చూడడమే ప్రధాన ఉద్దేశ్యం**
- **జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు**

**మెదక్ జనవరి 03 (ప్రజా స్వరం) :**



బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన తో పాటు తప్పిపోయిన, ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న పిల్లలను రక్షించే లక్ష్యం అని జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆపరేషన్ స్మైల్-12 కార్యక్రమంలో భాగంగా మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో అవగాహన పోస్టర్లను జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ బాలలను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమని, అలాంటి యజమానులపై కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రమాదకర ప్రాంతాల్లో పనిచేస్తున్న పిల్లలను గుర్తించి రక్షించడం, తప్పిపోయిన పిల్లలను వారి కుటుంబ సభ్యులకు చేర్చడం, అనాథ పిల్లలకు పునరావాసం కల్పించడమే ఆపరేషన్ స్మైల్ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. బాలల ముఖాల్లో చిరునవ్వు చూడడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం అని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. ఆపరేషన్ స్మైల్ కార్యక్రమం ప్రతి సంవత్సరం జనవరి 1 నుండి జనవరి 31 వరకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో, వివిధ శాఖల సమన్వయంతో నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా పరిశ్రమలు, హోటళ్లు, వ్యాపార సముదాయాలు, గోదాములు, ఇటుక బట్టీలు, మెకానిక్ షాపులు తదితర ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలతో తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా బాల కార్మికులు లేదా సహాయం అవసరమైన పిల్లలు కనిపిస్తే వెంటనే డయల్ 100 లేదా 1098 కు సమాచారం ఇవ్వాలని జిల్లా ఎస్పీ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, ఏఆర్ డీఎస్పీ రంగా నాయక్, ఎస్బి ఇన్స్పెక్టర్ సందీప్ రెడ్డి, డీసీఆర్బి ఇన్స్పెక్టర్ కృష్ణ మూర్తి, ఆర్ ఎస్ఐ నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళా విద్యకు మార్గదర్శకురాలు సావిత్రిబాయి



- **మాజీ జెడ్పీటీసీ రామచంద్రం**

**గజ్వేల్/మార్కుక్ జనవరి 03 ప్రజాస్వరం :**

సావిత్రిబాయి పూలే చిరస్మరణీయురాలు అని మాజీ జెడ్పిటిసి రామచంద్రం అన్నారు, భారత దేశంలో మహిళా విద్యకు పునాదులు వేసిన తొలి మహిళా ఉపాధ్యాయురాలు, సామాజిక సంస్కర్త సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా శనివారం సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం చేబర్తి గ్రామంలో గ్రామ మహనీయుల ఉత్సవాల కమిటీ కన్వీనర్ జాలని యాదగిరి కో,కన్వీనర్ కనకరాజు ఆధ్వర్యంలో మాజీ జెడ్పిటిసి రామచంద్రం, గ్రామ సర్పంచ్ ర్యాకం యాదగిరి, పాలకవర్గం సావిత్రిబాయి పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ, స్త్రీలకు చదువు అవసరం లేదని భావించిన కాలంలోనే సావిత్రి బాయి మహిళలకు విద్య అందించి సమాజాన్ని మేల్కొల్పిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. కులవ్యవస్థ, లింగ వివక్షకు వ్యతిరేకంగా ఆమె చేసిన పోరాటం నేటికీ ఆదర్శమని తెలిపారు. ముఖ్యంగా బాలికల విద్య, అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆమె చేసిన కృషి దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందని పేర్కొన్నారు. నేటి యువత సావిత్రిబాయి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని చదువు, సమానత్వం, సామాజిక బాధ్యతల వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం సావిత్రిబాయి పూలే జన్మదినాన్ని మహిళా ఉపాధ్యాయుల దినోత్సవం గా ప్రకటించి అధికారికంగా నిర్వహించడంతో ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో కార్యదర్శి సిద్దేశ్వర్, గ్రామ ఉప సర్పంచ్ బొగ్గుట శ్రీకాంత్, ఆత్మ కమిటీ మాజీ డైరెక్టర్ బబ్బూరి రాములు గౌడ్,సారథి ఫౌండేషన్ చైర్మన్ గుడాల శేఖర్ గుప్తా, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నర్సింలు,టీచర్ శ్రీధర్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



# మహిళల విద్యాభివృద్ధికి సావిత్రిబాయి పూలే కృషి

- **వర్గల్ సర్పంచ్ జయభారతి**

**గజ్వేల్ / వర్గల్ జనవరి 03 ప్రజాస్వరం**

మహిళల విద్యాభివృద్ధికి కృషి చేసిన తొలితరం మహిళా ఉద్యమకారిణి సావిత్రి బాయి పూలే అని వర్గల్ సర్పంచ్ జయభారతి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని పీఎం శ్రీ జెడ్పిహెచ్ఎస్, ప్రైమరీ స్కూల్లో సావిత్రిబాయి పూలే జయంతి సందర్భగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే మహిళా ఉపాధ్యాయులను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రైమరీ స్కూల్లో భోజన ప్రక్రియను వారు పరిశీలించి పిల్లలతో భోజనం చేశారు. విద్యార్థులు మంచిగా చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని వారి తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ సీనియర్ నాయకులు వేలూరి కృష్ణారెడ్డి, దేవగనిక నాగరాజు, శ్రీనివాస్ రెడ్డి, వార్డ్ మెంబర్లు పరశురాములు, మోసిన్, పాఠశాల ఉపాధ్యాయులు మహిళా ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.




# చైనా మాంజా విక్రయిస్తే చర్యలు

- **ఎస్పీ పరితోష్ పంకజ్**

**సంగారెడ్డి జిల్లా, జనవరి 03(ప్రజా స్వరం) :**

సంగారెడ్డి జిల్లాలో ఎవరైనా చైనా మాంజా (నైలాన్ దారం)ను విక్రయించినా, నిల్వ ఉంచినా కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ హెచ్చరించారు. చైనా మాంజాను ప్రభుత్వం పూర్తిగా నిషేధించిందని ఆయన స్పష్టం చేశారు. చైనా మాంజా వాడకం వల్ల ద్విచక్ర వాహనదారులు, పాదాచారులు తీవ్రంగా గాయపడుతున్నారని, అలాగే పక్షులు ప్రాణాలు కోల్పోతున్నాయని ఎస్పీ పేర్కొన్నారు. ప్రజల భద్రత దృష్ట్యా ఈ నిషేధాన్ని కఠినంగా అమలు చేస్తామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పతంగుల దుకాణాలు, విక్రయ కేంద్రాలపై పోలీసులు ప్రత్యేక తనిఖీలు, దాడులు నిర్వహిస్తారని చెప్పారు. తనిఖీల్లో చైనా మాంజా పట్టుబడితే సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు కూడా చైనా మాంజా విక్రయం లేదా వినియోగం గురించి సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని ఎస్పీ పరితోష్ పంకజ్ విజ్ఞప్తి చేశారు.



# దౌల్తాబాద్‌లో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు

**దౌల్తాబాద్, జనవరి 3( ప్రజాస్వరం) :**

దౌల్తాబాద్ బాలుర ఉన్నత పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాధికారి హాజరై మాట్లాడారు. మహిళల అభ్యున్నతి కోసం జీవితాంతం కృషి చేసిన మాతృమూర్తి సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. మహిళల విద్యకు ప్రాధాన్యత నిస్తూ స్వయంగా పాఠశాలలు స్థాపించి, వారి ఉన్నతిని గుర్తించిన తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అని పేర్కొన్నారు. ఆమె చూపిన మార్గంలో నడుచుకుంటూ, ఆమె ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు అనిల్ కుమార్ మాట్లాడుతూ సమాజ చైతన్యం కోసం సావిత్రిబాయి పూలే చేసిన సేవలు మరువలేనివని అన్నారు. మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలలో మహేశ్వరి అంబిక మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అలాగే మహిళా ఉపాధ్యాయుల చేతుల మీదుగా పాఠశాల ఆవరణలో స్పోర్ట్స్ హబ్ గదిని నూతనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శారీరక విద్యాధికారి విష్ణుకుమార్, శ్రీనివాస్ రెడ్డి, కృష్ణ, శివరాజ్, హరికృష్ణ, డాక్టర్ రవీందర్, గోపాల్ రెడ్డి, మనోహర్, సీఆర్పీలు రాజు, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.



# కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ విద్యాసంస్థలు


• **ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**రామచంద్రాపురం, జనవరి 03(ప్రజా స్వరం) :**

కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ విద్యాసంస్థల్లో మెరుగైన విద్యా బోధన అందిస్తున్నామని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం రామచంద్రాపురం జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించిన పాఠశాల 75వ వార్షికోత్సవ (ప్లాటినం జూబ్లీ) వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు, శాసన మండలి మాజీ చైర్మన్ భూపాల్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే జీఎంఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేజీ నుంచి పీజీ వరకు ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఉచిత విద్య అందించాలన్న లక్ష్యంతో పటాన్చెరు పట్టణంలో ప్రభుత్వ విద్యాసంస్థలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఇటీవల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రారంభించామని, త్వరలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల కూడా ఏర్పాటు కాబోతుందని వెల్లడించారు. విద్యార్థులు తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ఉన్నత లక్ష్యాలతో విద్యను అభ్యసించి, చదువుకున్న పాఠశాలకు మరియు పుట్టిన ఊరికి మంచి పేరు తీసుకురావాలని ఆయన కోరారు. అలాగే మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సింధు ఆదర్శ్ రెడ్డి, మెట్టు కుమార్ యాదవ్, పుష్ప నగేష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, గోదావరి అంజిరెడ్డి, పరమేష్ యాదవ్, ఐలేష్ యాదవ్, కుమార్ గౌడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాథోడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




# రైతులకు అందుబాటులో యూరియా



**దౌల్తాబాద్, జనవరి 3 (ప్రజాస్వరం) :**

రాష్ట్రంలో పంట సాగిస్తున్న రైతులు యూరియా కోసం ఎదుర్కొంటున్న ఇబ్బందులు గమనించిన ప్రభుత్వం, రైతుల అవసరాలను తక్షణమే తీర్చే కృషి ప్రారంభించింది. పంటను సజావుగా సాగించాలనుకునే ప్రతి రైతుకు అవసరమైనంత యూరియా అందించాలనే లక్ష్యంతో దౌల్తాబాద్ మండలంలో యూరియా కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి ఆధ్వర్యంలో జరిగినప్పటి, ముఖ్య అతిథిగా కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు పడాల రాముడు హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ, యూరియా కార్డుల పంపిణీ ద్వారా ఎరువును సమయానికి పొందగలుగుతారని, ఇది రైతుల పంటలకు మరింత భరోసా కల్పిస్తుందని వివరించారు. ప్రాంతీయ వ్యవసాయ వర్గాల సమాచారం ప్రకారం, యూరియా సరఫరా సమస్యను తగ్గించడానికి ప్రభుత్వం కచ్చితమైన, సమర్థవంతమైన చర్యలను చేపట్టింది. పత్తి, ధాన్యం, మరియు ఇతర ముఖ్య పంటల సాగుదల కోసం యూనిట్ లు, సరఫరా కేంద్రాలు సమన్వయంగా పని చేస్తున్నాయి. రైతుల పంటల పర్యవేక్షణ, ఎరువుల సరఫరా, మరియు పంటల నష్ట నివారణలో ప్రభుత్వం పూర్తి నిబద్ధతతో ముందుకు వెళ్తోందని అధికారులు తెలిపారు. వాటి ద్వారా, రైతులు సమయానికి అవసరమైన ఎరువును పొందగలిగి, పంటల వృద్ధి మరియు వారి ఆర్థిక స్థితిలో స్థిరత్వం క్రమంగా ఏర్పడుతుంది. యూరియా కార్డుల పంపిణీ ప్రక్రియ గ్రామస్థాయిలో కూడా సజావుగా జరుగుతున్నది, తద్వారా రైతుల మానసిక ఒత్తిడి తగ్గడం, పంటల ఉత్పత్తి పెరుగుదలకి పెద్దగా మద్దతు లభిస్తోంది.

# సావిత్రి భాయి పూలే జయంతి

**మేడ్చల్,(ప్రజాస్వరం):**

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని మేడ్చల్ సర్కిల్ జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో ఘనంగా భారతదేశ తొలి ఉపాధ్యాయురాలు, ప్రముఖ సంఘ సంస్కర్త శ్రీమతి సావిత్రి భాయి పూలే గారి 195వ జయంతి వేడుకలు సావిత్రి భాయి పూలే గారి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి అనంతరం ప్రధానోపాధ్యాయురాలి గారితో పాటు ఉపాధ్యాయురాలు మంజుల అందరిని శాలువులతో సన్మానించిన మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అలాగే సావిత్రి భాయి పూలే గత 200 సంవత్సరాల ముందు మహిళలకు విద్య యొక్క ఆవిష్యకతను మహిళలకు తెలియజేసి తనని ఎన్ని ఇబ్బందులు పెట్టిన 52 పాఠశాలలను ప్రారంభించి 1846 సంవత్సరంలో మన దేశంలో ప్లేగు వ్యాధి ద్వారా చాలా మంది చనిపోవడంతో ప్లేగు వ్యాధిగ్రస్తుల ను అక్కున చేర్చొకొని ఎంతో మంది ప్రాణాలు కాపాడి చివరగా ఎంతో మంది మహిళలకు జ్ఞానాన్ని పంచి మహోన్నత్తురాలు సావిత్రి భాయి గారు మరణించారు. సావిత్రి భాయి పూలే గారి సేవలను స్మరించుకున్నారు.అనంతరం విద్యార్థులు పలు సంస్కృతిక కార్యక్రమాలు చేశారని తెలిపారు.పండ్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గ A బ్లాక్ అధ్యక్షులు పానుగంటి మహేష్ , మేడ్చల్ మున్సిపల్ అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి , మాజీ కౌన్సిలర్లు రామన్నగారి రాఘవేందర్ గౌడ్ , పాలకుర్తి రాఘవేందర్ గౌడ్ , రామన్న గారి మణికంఠ గౌడ్ , కౌడే మహేష్ , ప్రేమలత , లక్ష్మణ్ రావు,లవంగు రాకేష్ , దండు శ్రీకాంత్ , గుండా శ్రీధర్, వంజరి సన్నీ కుమార్, అనిల్ కుమార్ ,కటికే వినయ్ ,రంజిత్ రెడ్డి,ఎర్ర విజయ్ తదితరులు పాల్గొన్నారు*



# గాజులపల్లి పాఠశాలలో క్యాలెండర్ ఆవిష్కరణ

**దౌల్తాబాద్ జనవరి 3( ప్రజాస్వరం ):**

మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. మండల విద్యాధికారి గజ్జల కనకరాజు క్యాలెండర్‌ను ఆవిష్కరించి, అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఆకర్షణీయమైన సందేశాలు చెప్పారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ప్రజాస్వామి మరియు ఆయన పాలకుబంధులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యాధికారి క్రమశిక్షణ, విద్యార్థుల సౌందర్య, సాంస్కృతిక అభివృద్ధి కోసం ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. సర్పంచ్ ప్రజాస్వామి మాట్లాడుతూ, పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల శిక్షణలో స్థానిక సంఘాల భాగస్వామ్యం కీలకమని తెలిపారు. ఉపాధ్యాయులు సిఆర్పి రాజు విద్యార్థులు కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు.



## మున్సిపల్ ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించుకోవాలి

**తూప్రాన్, ప్రజాస్వరం :**

తూప్రాన్ మున్సిపల్ ఎన్నికలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ నాగేష్ పేర్కొన్నారు. శనివారం మున్సిపల్ కమిషనర్ గణేష్‌రెడ్డితో కలిసి పట్టణ సమీపంలోని నోబుల్ కళాశాలను పర్యవేక్షించారు. ఈ సదర్భంగా మాట్లాడుతూ త్వరలో మున్సిపల్ ఎన్నికలు జరుగనున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఓటరు జాబితా విడుదల చేసిన సంగతి తెలిసిందే అన్నారు. కాగ త్వరలోనే రిజర్వేషన్లు ఖరారు కానున్నట్లు పేర్కొన్నారు. ఇందుకోసం ఎన్నికల అనంతరం బ్యాలేట్ బాక్స్‌లను స్ట్రాంగ్ రూంలో భద్రపరచడంతో పాటు కౌంటింగ్ ప్రక్రియ కొనసాగనున్న నేపథ్యంలో ఇందుకు సంబంధించిన హాల్‌ను పరిశీలించినట్లు తెలిపారు. నోబుల్ కళాశాల అన్ని విధాలుగా అనుకులంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గణేష్‌రెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



# వడ్డేపల్లిలో ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు



**దౌల్తాబాద్ జనవరి 3( ప్రజాస్వరం ):**

శుక్రవారం వడ్డేపల్లి ఉన్నత పాఠశాలలో జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రాజాగారి రేణుకరాజాగౌడ్, ఉపసర్పంచ్ మర్యాల స్వామి మరియు వడ్డేపల్లి నాయకులు హాజరై కార్యక్రమాన్ని స్మరణీయంగా చేసారు. వారు జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమాజ సంస్కరణ, విద్యాభివృద్ధి కోసం ఆయన చేసిన సేవలు ఆదర్శనీయమని అన్నారు. విద్యార్థులు ఆయన ఆశయాలను అనుసరించి చదువుతోపాటు సామాజిక విలువలను పెంపొందించుకోవాలి అని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుధాకర్, వరప్రసాద్, రాజయ్య, కరుణాకర్, అనిల్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# గొడుగుపల్లిలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

**దౌల్తాబాద్, జనవరి 3 (ప్రజాస్వరం) :**

దౌల్తాబాద్ మండల పరిధిలోని గొడుగుపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ మద్దెల వనజ స్వామి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సర్పంచ్ మద్దెల వనజ స్వామి మాట్లాడుతూ, శిశువుల సంపూర్ణ ఆరోగ్యానికి తల్లిపాలు అత్యంత అవసరమని తెలిపారు. జననం నుంచి ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే అందించడం వల్ల పిల్లలు వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యంగా ఎదుగుతారని పేర్కొన్నారు. తల్లిపాలు శిశువుల శారీరక, మానసిక వికాసానికి ఎంతో దోహదపడతాయని అన్నారు. ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలకు పోషకాహారంపై పలు సూచనలు చేశారు. అలాగే తల్లిపాలపై ఉన్న అపోహలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు మద్దెల స్వామి, వార్డు సభ్యులు కర్ర మహేశ్, దుర్గని నర్సింలు, మధుసూదన్, మద్దెల మల్లేష్, గ్రామ ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR : PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999